సోమవారం
22-01-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 210
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రష్యా ఆక్రమిత ఉక్రెయిన్‌లో క్షిపణి దాడి
13 మంది మృతి

కీవ్: రష్యా ఆక్రమిత ఉక్రెయిన్ ప్రాంతంలో క్షిపణి దాడి జరిగింది. ఈ ఘటనలో 13మంది మృతి చెందగా... మరో 10మందికి గాయాలు అయ్యాయి. ఆదివారం ఉదయం డొనెట్‌స్క్‌లోని టెక్స్‌టిల్షిక్ ప్రాంతంలో ఓ మార్కెట్ సమీపంలో ఈ దాడి జరిగిందని, వీరిని ఆస్పత్రికి తరలించినట్లు ఆ ప్రాంతంలోని రష్యా అధికారి ఒకరు తెలిపారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఉక్రెయిన్ సైన్యమే ఈ దాడికి పాల్పడినట్లు సదరు అధికారి చెప్పారు. అయితే, ఈ ఘటనపై ఇప్పటివరకు ఉక్రెయిన్ స్పందించలేదు.

లెనిన్ మార్గం అనుసరణీయం

ప్రపంచ వ్యవస్థ మార్పు మార్క్స్ సిద్ధాంతంతోనే సాధ్యమని, దాన్ని అమలు చేసి చూపిన లెనిన్ మార్గం అనుసరణీయమని వక్తలు అన్నారు. కారల్‌మార్క్స్-ఎంగెల్స్-లెనిన్ విగ్రహ కమిటీ అధ్వర్యంలో వీఐ లెనిన్ శత వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని లెనిన్ విగ్రహం వద్ద ఆదివారం ఈ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది.

- మార్క్సిస్టు సిద్ధాంతంతోనే ఉన్నత సమాజం : ఈడ్పుగంటి
- ఘనంగా లెనిన్ శత వర్ధంతి
- నివాళులర్పించిన వామపక్ష నేతలు, మేధావులు

8లో

అంగన్‌వాడీ సమ్మె సెగ

ఉద్యమం ఉధృతం

- అధికార పార్టీ నేతల పర్యటనల్లో నిలదీత
- కానరాని సర్కారు సానుకూల చర్యలు
- ఎస్మాతో బెదిరింపుల పర్వం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అంగన్‌వాడీలతో సానుకూల చర్చల నిర్వహణలో ప్రభుత్వం విఫలమైంది. ప్రతిసారీ చర్చలకు వచ్చిన అంగన్‌వాడీలతో సమ్మె విరమింపజేయాలని ఒత్తిడి చేయడం మినహా... వారి డిమాండ్ల పరిష్కారంపై చొరవ చూపడం లేదు. దీంతో అధికార పార్టీ ప్రజాప్రతినిధుల పర్యటనలకు అంగన్‌వాడీల నిరవధిక సమ్మె సెగ తగులుతోంది. మంత్రుల నుంచి ఎమ్మెల్యేల వరకు ఎక్కడికక్కడే వారిని అంగన్‌వాడీలు నిరసనలతో అడ్డుకుంటున్నారు. బయటకు రావాలంటే మంత్రులు, ఎమ్మెల్యేలు జెంబేలెత్తుతున్నారు. రాష్ట్రంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఉధృత రూపం దాల్చుతోంది. అంగన్‌వాడీలకు కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు మద్దతు ప్రకటించాయి. దీంతో వారి ఉద్యమ స్వరూపం మారిపోయింది. ఒక వైపు సమ్మె కొనసాగిస్తూనే, మరోవైపు నిరసనలు, రిలే దీక్షలు, ఆందోళనలతో ముందుకు పోతున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం వారి ఉద్యమం అణచివేతకు పాల్పడుతోంది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాన్వాయ్‌ని అడ్డుకుని తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ నినదించారు. అంతకుముందు అనేక చోట్ల వైసీపీ ఎమ్మెల్యేల ఎదుట అంగన్‌వాడీలు నిరసనకు దిగారు. దాదాపు 40 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మెలో ఉన్నారు. ప్రాణాలకు తెగించి, కుటుంబాలను వదిలి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఉద్యమిస్తున్నారు. నిరాహార దీక్షలు చేస్తూ అనారోగ్యాల పాలవుతున్నారు. ఇప్పటి వరకు దఫాలుగా మంత్రుల కమిటీ, ఉన్నతాధికారులతో అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నేతలు చేసిన చర్చలూ ఫలించలేదు. కనీసం వేతనం అమలుపై కూడా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ అంగన్‌వాడీలకు తీవ్ర అన్యాయం చేస్తోంది. మరోవైపు వారి ఉద్యమాన్ని అణచివేసేందుకు కుట్రకు పాల్పడుతోంది. ఉద్యమిస్తున్న వారిపై ఎస్మా ప్రయోగానికి సిద్ధమైంది. వాటితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలను అడ్డుకుని నిరసన తెలిపిన అంగన్‌వాడీలు, నేతలపై పోలీసులు కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. మంత్రి పెద్దిరెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకున్నారంటూ

- మిగతా 2 లో

అంగన్‌వాడీలకు వామపక్ష నేతల సంఘీభావం

విశాలాంధ్ర-విజయవాడ: స్థానిక ధర్నా చౌక్ వద్ద ఐదు రోజులుగా నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లకు వామపక్షాల నేతలు ఆదివారం సంఘీభావం ప్రకటించారు. లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం ముగిసిన తరువాత లెనిన్ సెంటర్ నుంచి ధర్నా చౌక్ వరకు ర్యాలీగా వెళ్లి దీక్షలో కూర్చున్న వర్కర్లను పరామర్శించారు. పండగలు చేసుకోకుండా రోడ్డుపైన ఉన్న మహిళలపట్ల ముఖ్యమంత్రికి కనికరం లేదన్నారు. రుషికొండలో ఇల్లు కట్టుకోవటానికి 450 కోట్లు ఖర్చు చేసిన సీఎంకు అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించటానికి 300 కోట్ల రూపాయలు కేటాయించలేకపోతున్నారని విమర్శించారు. ప్రభుత్వం ప్రధాన కార్యదర్శిని కలిసి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం ఇవ్వటం జరిగిందన్నారు.

"ప్రాణ ప్రతిష్ఠకు"
అంతా సిద్ధం

అయోధ్య: అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామ మందిరంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు అంతా సిద్ధం అయిపోయింది. నిర్ణయించిన ముహూర్తం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 12 గంటల ఇరవై నిముషాలకు ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుంది. సోమవారం అయోధ్యలో అంతా హడావుడిగా ఉండబోతోంది. నాయకులు, అతిథ్యులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సేవకులు అందరూ చాలా హడావుడిగా ఉండబోతున్నారు. ప్రాణ ప్రతిష్ఠ చేయబోయే రాముడి విగ్రహాన్ని ప్రధాన దేవాలయంలోకి చేర్చారు. బాల రాముడి ఈ విగ్రహం నిలబడిన రూపంలో ఉంటుంది. అలాగే స్వయంభూ విగ్రహం కూడా ప్రధానాలయంలోనే ఉంటుందట. పూజారులు ఇతరులు బాల రాముడి కొత్త విగ్రహాన్ని ప్రధానాలయంలోకి చేర్చారు. ఆలయ పరిక్రమ దాదాపు 795 మీటర్ల పొడవు ఉంది. 32 మెట్లెక్కి భక్తులు అసలు ఆలయానికి చేరుకోవలసి ఉంటుంది. ప్రధానాలయాల సరసన

- మిగతా 2 లో

బాబు, జగన్ పాలనలో
రాష్ట్రం అధోగతి

- హోదా సాధనలో ఘోర వైఫల్యం
- బీజేపీకి తొత్తులుగా టీడీపీ, వైసీపీ
- ఉద్యోగాల హామీతో యువతకు బీజేపీ దగా
- నిప్పులు చెరిగిన వైఎస్ షర్మిల
- పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతల స్వీకారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని విధాలా బీజేపీ మోసగిస్తుంటే...టీడీపీ, వైసీపీ మాత్రం ఆ పార్టీకి తొత్తులుగా మారాయని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని 25మంది ఎంపీలూ బీజేపీ చెప్పుచేతల్లో ఉన్నారని... ప్రజలు బీజేపీకి ఓటు వేయక పోయినా... టీడీపీ, వైసీపీ ఎంపీలు మాత్రం బీజేపీ గుప్పెట్లో ఉన్నారని మండిపడ్డారు. విజయవాడ తాడిగడపలోని ఆహ్వానకల్యాణ మండపంలో ఆదివారం భారీ సంఖ్యలో హాజరైన పార్టీ నేతలు, కార్యకర్తల నడుమ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు గన్నవరం విమానాశ్రయం నుంచి సభా స్థలివరకు షర్మిల ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా షర్మిలకు పీసీసీ నియామక పత్రాలను మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు కేవీపీ రామచంద్రరావు, సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, పల్లం రాజు తదితర నేతలు ఆమెను ఆహ్వానించారు. ఈ సభ అనంతరం ఆమె విజయవాడ ఆంధ్రరత్నభవన్‌కు చేరుకుని తన ఛాంబరుకు వెళ్లారు. తొలుత బాధ్యతల స్వీకరణ సభలో షర్మిల ప్రసంగిస్తూ... అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీపైనా విమర్శలు గుప్పించారు. కేంద్రంలోని బీజేపీపై దుమ్మెత్తి పోశారు. ఆ పార్టీకి వైసీపీ, టీడీపీ తొత్తులుగా మారాయని తూర్పారబట్టారు. బీజేపీ చేతుల్లో ఆ పార్టీలు ఉన్నప్పుడు ఎంపీ ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి, వైసీపీకి ఎందుకు ఓటు వేయాలని సూటిగా ప్రశ్నించారు. బీజేపీకి అమ్ముడు పోవడానికి వైసీపీ నుంచి,

- మిగతా 2 లో

అయోధ్యలో భూమి బూమ్!

- వక్ఫ్ భూములపై కాషాయ పంజా
- బడా వ్యాపారుల జోరు... ఆక్రమణల హోరు
- రైతులూ నష్టపోతున్న వైనం
- బీజేపీ పాలిత రాష్ట్రాలకే ఇక్కడి అభివృద్ధి పనులు

లక్నో : అయోధ్యలో రామ మందిరం ఇప్పుడు విస్తృతంగా ప్రచారమవుతున్న అంశం. కేంద్రంలోని కాషాయ పార్టీ బీజేపీ నేతృత్వంలోని మోదీ సర్కార్‌కు ఇదొక వరంగా మారింది. రాముడి పేరుతో రాజకీయ లబ్ధి కోసం తన హిందూత్వ భావ జాలాన్ని వ్యాప్తి చేస్తూ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి గెలిచేందుకు అయోధ్య రామమందిరం అంశం దోహదపడుతుందని భావిస్తోంది. ఇదే సమయంలో అయోధ్య ఇప్పుడు వ్యాపారులకు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు కూడా పెద్ద వరంగా మారింది. ఇక్కడ భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇదే అదునుగా భూములు కబ్జాకు పాల్పడుతున్నారు. ఇందులో బీజేపీ, దాని హిందూత్వ సంస్థలైన ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ అనుకూలుర పాత్ర

- మిగతా 2 లో

ఇదీ లోకం!

గాజాలో 25 వేలు దాటిన మరణాలు

- మృతుల్లో 70 శాతానికి పైగా స్త్రీలు, పిల్లలు
- 19 లక్షల మంది నిరాశ్రయులు
- ఆరు లక్షలమంది ఆకలి కేకలు

గాజా: ఇజ్రాయిల్ - హమాస్ మధ్య గత మూడు నెలలుగా జరుగుతున్న యుద్ధంలో అశువులు బాసిన పలస్తీనియన్ల 25వేలకు మించి పోయింది. మృతుల్లో 70 శాతానికి పైగా స్త్రీలు, పిల్లలే. ఈవిషయాన్ని గాజా ఆరోగ్య శాఖ ఆదివారం వెల్లడించింది. ఆరోగ్య శాఖ ప్రతినిధి అష్రఫ్ అల్ కిద్రా కథనం ప్రకారం... గడచిన 24 గంటల్లో ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల్లో గాజాలో 178 మంది మృతి చెందగా, 300 మంది పలస్తీనియన్లు గాయాలపాలయ్యారు. వీరందరినీ వివిధ ఆస్పత్రులకు తీసుకొచ్చారు. గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయిల్‌పై హమాస్ మిలిటెంట్ల ఆకస్మిక దాడితో యుద్ధం ప్రారంభమైంది. ప్రస్తుతం ఇజ్రాయిల్ ఆర్మీ గ్రౌండ్ ఆపరేషన్ గాజాలోని ఖాన్ యూనిస్, సెంట్రల్ గాజాలలో కొనసాగుతోంది. ఈ నగరాల్లోని శరణార్థి శిబిరాలపైనా ఇజ్రాయిల్ సైన్యం దాడులు చేస్తోంది. ఈ యుద్ధం కారణంగా గాజా జనాభాలో దాదాపు 85 శాతం మంది తమ ఇళ్లను విడిచి వెళ్లిపోయారు. ఇజ్రాయిల్ ఆర్మీ వైమానిక దాడుల్లో వేలాది ఇళ్ల నేలమట్టం అయ్యాయి. కాగా గాజాలోని 23

- మిగతా 2 లో

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా
మాధవ స్వామి, పిల్లలమర్రి నాగేశ్వరరావు

విశాలాంధ్ర-మంగళగిరి : రెండు రోజులపాటు గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు ఆదివారం ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిశాయి. మహాసభ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అధ్యక్షులుగా బుగిడే మాధవస్వామి, ప్రధాన కార్యదర్శిగా పిల్లలమర్రి నాగేశ్వరరావు, కోశాధికారిగా బత్తూరి మోహనరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కడుపు కన్నయ్య, నీలూరి లక్ష్మయ్య, బి.వెంకటనారాయణ, జొన్నాదుల భారతి, సహాయ కార్యదర్శులుగా పామిశెట్టి గోవిందు, గొట్టిముక్కల బాలాజీ, పి.హరి, వై.పీతాంబరధరరావును మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. మరొక 35 మందితో నూతన కౌన్సిల్ ఏర్పడినట్లు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి జింక చలపతి విలేకరులకు తెలిపారు.

అయోధ్య మసీదు సంగతేంటి?

- బ్లూప్రింట్‌కే పరిమితమైన వైనం
- ముస్లిం సమాజంలో అసంతృప్తి

2లో

అయోధ్య మసీదు సంగతేంటి?

అయోధ్య (ఉత్తర ప్రదేశ్) : రామమందిరాన్ని పవిత్రం చేశారు. మరి ప్రతిపాదిత మసీదు నిర్మాణం సంగతేమిటి. ఇది బ్లూప్రింట్‌గా మాత్రమే ఉంది. అయోధ్యలో నిర్మాణంలో ఉన్న గొప్ప ఆలయానికి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న టెఢీ బజార్‌లోని ఒక మసీదు దగ్గర ముస్లిం సమూహం నిల్చొని ఉంది. వారి శుక్రవారం ప్రార్థనల నుంచి అప్పుడే తిరిగి వచ్చారు. రాబోయే రామమందిర ప్రారంభోత్సవ కార్యక్రమం గురించి చర్చిస్తున్నారు. ప్రతిపాదిత మసీదు నిరంతరం చర్చకు వస్తుంది. 'ఆలయం పట్ల మాకు ఎలాంటి ప్రతికూల భావాలు లేవు. కానీ ప్రతిపాదిత మసీదు పనులు ఇంకా ప్రారంభం కానందున మేము అసంతృప్తిగా ఉన్నాము. రామమందిరం ప్రారంభోత్సవం రోజున హిందువులు దీపావళి జరుపుకుంటారు. మేము ముస్లింలు ఇంట్లోనే ఉండాలని నిర్ణయించుకున్నాము' అని సమీపంలోని పంజిటోలా మొహల్లాలో నివసించే 55 ఏళ్ల సగీర్ అహ్మద్ అన్నారు. మరొక వ్యక్తి హిందూ-ముస్లిం ఐక్యత గురించి మాట్లాడారు. 'మేము స్థానిక హిందువులకు భయపడము. వారు మాతో శాంతి, సామరస్యంతో జీవిస్తారు. కానీ బయటి వ్యక్తులు ఇబ్బంది పెట్టవచ్చు' అని తెలిపారు. అయోధ్యలోని అనేక ఇతర ముస్లింల మాదిరిగానే, అతను జనవరి 22న ఇంట్లోనే ఉండాలని యోచిస్తున్నాడు. భద్రతా బలగాల కనుసన్నల్లో అయోధ్య ఉంది. స్థానిక హజ్రత్ శీష్ దర్గా సంరక్షకుడు మహ్మద్ జాకీర్ మాట్లాడుతూ ప్రతిష్ఠాపన కార్యక్రమం తేదీలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ఉద్రిక్తత నెలకొనకుండా వార్షిక ఉర్సు (ఉత్సవం) ఒక నెలకు పైగా ఆలస్యమైందని చెప్పారు.

మసీదు నిర్మాణంపై పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ఆలయంతో పాటు మసీదును ఏకకాలంలో నిర్మించడానికి కేంద్రం, రాష్ట్రంలోని ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ప్రత్యేకంగా కోరింది. అయినప్పటికీ, అయోధ్య హిందూ దేవాలయం ప్రారంభోత్సవం జరుగుతున్న సమయంలో అయోధ్యలోని ప్రతిపాదిత ముహమ్మద్ బిన్ అబ్దుల్లా మసీదు కేవలం బ్లూప్రింట్‌గా మాత్రమే ఉంది. ఈ ప్రదేశం అయోధ్య నడిబొడ్డు నుంచి దాదాపు 25 కిలోమీటర్ల దూరంలో ధన్నీపూర్ మురికి మైదానంలో ఉంది. ఇక్కడ నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. వాగ్దానం చేసిన మసీదు నిర్మాణం కోసం వేచి ఉంది. చుట్టూ ఎలాంటి ఆర్భాటాలు లేవు. దీని చుట్టూ పెద్ద ప్రాజెక్టులు ప్రకటించలేదు. పనులు కూడా ప్రారంభం కాలేదు. ఇంకా పూర్తి స్థాయిలో నిధులు రావాల్సి ఉంది. అబ్దుల్ మజీద్ (60) మసీదు ప్రతిపాదిత నిర్మాణ స్థలం సమీపంలో ఒక చిన్న మిఠాయి దుకాణం నడుపుతున్నాడు. ఇక్కడ ఒక మసీదు నిర్మాణం తరువాత అభివృద్ధి చెందుతుందని, గ్రామస్తులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని నమ్ముతున్నాడు. రాజా (22) ధన్నిపూర్‌లో నివసిస్తున్నాడు. 'అందరి అభివృద్ధి గురించి మాట్లాడతారు. అయోధ్యలో అభివృద్ధి నది ప్రవహిస్తుండగా, ధన్నీపూర్‌లో ఎందుకు ప్రవహించకూడదు?' అని ప్రశ్నించారు. 'మసీదు కోసం స్థలం ఇక్కడ కేటాయించినట్లు తెలియగానే మా గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఆనందానికి లోనయ్యారు. కానీ ఇప్పటి వరకు మాకు ఏమీ ఇవ్వలేదు' అని మరో స్థానికుడు తెలిపారు. వీరిలో ఎక్కువ మంది కూలీ పనులు చేసుకుంటూ ఉపాధి వెతుక్కుంటూ వలస వెళుతున్నారని మరో స్థానికుడు సోహ్రాబ్ తెలిపారు. ధన్నీపూర్, రౌనాహి గ్రామాల్లో ముస్లింలు అత్యధికంగా ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలు లేవు. చిన్న మదర్సాలు, ప్రైవేట్ పాఠశాలలు మాత్రమే ఉన్నాయి. రోడ్డు పక్కనే ఉన్న రెండు గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదు. లక్నోకు చెందిన ఐఐసీఎఫ్ కార్యదర్శి అథర్ హుస్సేన్ సిద్ధిఖీ మాట్లాడుతూ 'కొత్త మసీదు తగినంత పెద్దదిగా ఉండాలి. దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలు దాని కోసం నిధులు సేకరించడం అవసరం. మనం ఏమి సాధించాలనుకుంటున్నామో కార్యాచరణ రూపొందించడానికి కూడా భారీ నిధులు అవసరం. డిజైన్లు పునర్నిర్మించబడ్డాయి. ఇప్పుడు అది భారతీయ సంప్రదాయ డిజైన్‌తో ఉంటుంది. డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించిన తర్వాతే మ్యాప్ క్లియర్ అవుతుంది. అది కొన్ని కోట్ల వరకు ఉంటుంది' అని ఆయన అన్నారు. ఇదిలాఉండగా, బాబ్రీ మసీదు వివాదం కేసులో పాత వ్యాజ్యదారుడు హాషీమ్ అన్సారీ కుమారుడు ఇక్బాల్ అన్సారీ రామమందిరం ఆలయ ట్రస్టు నుంచి దాని ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరు కావడానికి ఆహ్వానాన్ని అంగీకరించారు. 'దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలు కోర్టు తీర్పును గౌరవించారు. శాంతియుతంగా ఆమోదించారు. ఇప్పుడు ఈ వివాదానికి ముగింపు పలకాలని కోరుతున్నారు. వారు ముందుకు సాగాలన్నారు. కొత్త మసీదు ఎవరికీ అక్కర్లేదు. ఈ కొత్త మసీదు పాత గాయాలను గుర్తుకు తెస్తుంది' అని అన్నారు. ముస్లిం పక్షం ఈ తీర్పును శాంతియుతంగా అంగీకరించినప్పటికీ, కొత్త మసీదు నిర్మాణంలో జాప్యం కారణంగా స్థానిక ముస్లింలతో పాటు బయటి వారిలో ఆగ్రహం ఉంది.

ట్రంప్‌కు మతి భ్రమించింది: నిక్కీ హేలీ

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మతి భ్రమించిందని అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున అభ్యర్థిత్వం కోసం పోటీపడుతున్న భారతీయ అమెరికన్ నిక్కీ హేలీ విమర్శించారు. ఆయన మానసిక పరిస్థితి సరిగా లేదని, వయో భారంతో అధ్యక్ష బాధ్యతలను నిర్వహించలేరని ఆమె ఎద్దేవా చేశారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా హేలీపై ట్రంప్ పరుష వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యక్ష పదవికీ ఆమె తగదంటూ, అమెరికా 'క్యాపిటల్ హిల్' భవనంపై జరిగిన దాడిని అడ్డుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. నిక్కీ హేలీని అమెరికా ప్రతినిధుల సభ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీగా ట్రంప్ పొరబడ్డారు. ఈ క్రమంలో పరుషంగా మాట్లాడారు. వీటికి స్పందించిన హేలీ... ఆయన మానసికస్థితి సరిగా లేదని విమర్శించారు. "గత రాత్రి ఎన్నికల ర్యాలీలో ట్రంప్ నా పేరును పదే పదే ప్రస్తావించారు. క్యాపిటల్ భవనంపై దాడి సమయంలో సరైన భద్రతా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వాస్తవానికి జనవరి 6న నేను వాషింగ్టన్‌లో లేను. దేశం, ప్రపంచంలో పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నప్పుడు 80 ఏళ్ల నిండిన వ్యక్తులు (బైడెన్, ట్రంప్‌ను ఉద్దేశించి) అధ్యక్షులుగా మనకు అవసరమా? ట్రంప్ గురించి నాకు బాగా తెలుసు. ఆయన అభద్రతా భావానికి గురైనప్పుడే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారు" అని నిక్కీ విమర్శించారు. ఆయనకు ప్రపంచంలోని (చైనా, రష్యా, ఉత్తర కొరియా అధ్యక్షుల పేర్లు పరోక్షంగా ప్రస్తావిస్తూ) నియంతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని విమర్శించారు. కాగా రిపబ్లికన్ పార్టీలో అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం జరుగుతున్న అంతర్గత ఎన్నికల్లో ట్రంప్ ఒకింత ముదుండగా... తర్వాతి స్థానంలో నిక్కీ కొనసాగుతున్నారు. తాజా సర్వేల ప్రకారం వీరిద్దరి మధ్య వ్యత్యాసం కేవలం 10 శాతం మాత్రమే.

అఫ్గాన్‌లో కుప్పకూలిన విమానం

కాబుల్: అఫ్గానిస్థాన్‌లో మొరాకోకు చెందిన ఛార్టర్డ్ విమానం కుప్పకూలింది. ఆదివారం ఉదయం బదాక్షన్ ప్రావిన్స్‌లోని జెబాక్ జిల్లా తోప్‌ఖానా కొండల్లో ఈ విమానం కూలిపోయినట్లు అఫ్గాన్ పోలీసులు తెలిపారు. తొలుత ఇది భారత్‌కు చెందినదని అఫ్గాన్ వార్తా సంస్థ టోలో పేర్కొన్నప్పటికీ ఈ వార్తలను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తోసిపుచ్చింది. అది మొరాకోకు చెందిన ఫాల్కన్ జెట్ విమానమని, దానిని ఎయిర్ అంబులెన్స్‌గా ఉపయోగిస్తున్నట్లు తెలిపింది. థాయ్‌లాండ్ నుంచి రష్యా రాజధాని మాస్కోకు బయల్దేరిన ఈ విమానం భారత్‌లోని గయ విమానాశ్రయంలో ఇంధనం కోసం ఆగినట్లు వెల్లడించింది. మరోవైపు ఇది రష్యాకు చెందిన విమానంగా అంతర్జాతీయ వార్తా కథనాలు పేర్కొన్నాయి. తమ దేశానికి చెందిన ఫాల్కన్ జెట్ విమానం ఆరుగురు ప్రయాణికులతో శనివారం రాత్రి నుంచి రాడార్‌తో సంబంధాలు కోల్పోయిందని రష్యన్ విమానయాన శాఖ వెల్లడించినట్లు తెలిపాయి. ఈ ప్రమాదం మారుమూల ప్రాంతంలో జరగడంతో సహాయక బృందాలు అక్కడికి చేరుకోవడం కష్టతరంగా మారింది.

అంగన్‌వాడీ సమ్మె సెగ

(మొదటిపేజీ తరువాయి)

ఉరవకొండకు చెందిన 12 మంది అంగన్‌వాడీ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాస్తారోకోలకు దిగిన అంగన్‌వాడీలపై పోలీసులతో దాడులు చేసిన సంఘటనలో 10 మంది గాయాలకు గురయ్యారు. ఈ చర్యలను వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

అంగన్‌వాడీలకు తీరని అన్యాయం

రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 60 వేల మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోంది. ఇందులో చాలా మంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే ఉన్నారు. పక్క రాష్ట్రాలయిన కర్నాటక, తెలంగాణ, పుదుచ్చేరిలో ఇచ్చే వేతనాల కంటే, ఏపీ ప్రభుత్వం అంగన్‌వాడీలకు తక్కువ వేతనం ఇస్తోంది. దీనిపై అనేక దఫాలుగా ప్రభుత్వానికి వినతులు అందజేసినప్పటికీ, స్పందించకపోవడంతోనే అంగన్‌వాడీలు సమ్మెబాట పట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తలచుకుంటే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడం పెద్ద కష్టతరం కాదు. మంత్రివర్గ సభ్యులు, అధికారులు మొండి వైఖరితో ఉన్నందునే... ఇప్పటిరకు జరిగిన చర్చలు విఫలమైనట్లు తెలుస్తోంది. మరో రెండు నెలల్లో ఎన్నికలు రానున్న తరుణంలో ప్రభుత్వం ఆలోచనాత్మకంగా వ్యవహరించి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. అయితే అవేమీ ఖాతరు చేయకుండా ఎన్నికల తర్వాతే వేతనాల పెంపుపై ఆలోచిస్తామని నొక్కిచెప్పడం దారుణమని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పండుగల సమయంలో తమ కుటుంబాలను సైతం వదులుకుని రోడ్లపైకి వచ్చి ఉద్యమిస్తుంటే ప్రభుత్వం మొద్దునిద్ర వహిస్తోందని మండిపడుతున్నారు. చర్చలకు పిలిచినట్లు పిలిచి... మళ్లీ చెప్పిన విషయాలనే చెబుతున్నారని, సమ్మెను విరమింపజేయాలని ఒత్తిడి చేస్తున్నారని, తమ డిమాండ్లపై మాత్రం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని, ఎస్మాలకు భయపడబోమని స్పష్టం చేస్తున్నారు.

ఉద్యోగాల తొలగింపునకు కుట్ర

అంగన్‌వాడీలు సమ్మెకు దిగడంతో వారి ఉద్యోగాలను తొలగించేందుకు ప్రభుత్వం కుట్రకు పాల్పడుతోందనే ప్రచారం ఉంది. వారి స్థానంలో కొత్త వారితో విధులు నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ప్రాథమిక పాఠశాలలకు వచ్చే చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం ఇవ్వడం, అంగన్‌వాడీ కేంద్రాల పరిరక్షణ తదితర విధులను అంగన్‌వాడీలు, హెల్పర్లు నిర్వహిస్తుంటారు. వారు సమ్మె కారణంగా పిల్లలు, గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీలో అసౌకర్యం నెలకొంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలకు ఉపక్రమించినట్లు తెలిసింది. ఇప్పటికే ప్రభుత్వం ఎస్మా ప్రయోగించి, తక్షణమే అంగన్‌వాడీలు విధుల్లోకి హాజరు కావాలని డెడ్‌లైన్ విధించింది. దీంతో అటు ప్రభుత్వానికి, ఇటు అంగన్‌వాడీల మధ్య పూర్తి అగాధం ఏర్పడింది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో అంగన్‌వాడీల ఉద్యమాల అనంతరం ప్రభుత్వాలు గద్దె దిగిన సంఘటనలున్నాయి. అప్పటి టీడీపీ ప్రభుత్వం అంగన్‌వాడీలపై దారుణంగా వ్యవహరించడం, అనంతరం ఆ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పిన విషయం విదితమే. ఇదే తరహాగా సీఎం జగన్ ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే, రాబోయే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేస్తామని అంగన్‌వాడీల నేతలు హెచ్చరిస్తున్నారు. రోజురోజుకీ అంగన్‌వాడీల ఉద్యమం బలపడటంతో రాష్ట్ర ప్రభుత్వానికి దిక్కుతోచడం లేదు. దీంతో ఎలాగైనా సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు సిద్ధమైంది. అందులో భాగంగానే అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం, ఆ తర్వాత వారిని ఉద్యోగాల నుంచి తొలగింపునకు ప్రయత్నించడం తదితర చర్యలకు పాల్పడుతోంది. ఈ చర్యలను ప్రభుత్వం విడనాడి, తక్షణమే అంగన్‌వాడీలు, హెల్పర్ల డిమాండ్ల సమస్యల పరిష్కారం కోసం సానుకూలమైన చర్యలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

రాష్ట్రం అధోగతి

(మొదటిపేజీ తరువాయి)

టీడీపీ నుంచి ఎందుకు పోటీకి పెట్టాలని ప్రశ్నించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా బీజేపీతో టీడీపీకి, వైసీపీకి పొత్తు ఉందని స్పష్టం చేశారు. ఇది నిజంకాకుంటే ఐదేళ్లలో వైసీపీ ఎందుకు బీజేపీనీ విమర్శించలేదని ఆమె ప్రశ్నించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చినట్లయితే బీజేపీకి మద్దతిచ్చినా రాష్ట్ర ప్రజలు సంతోషిస్తారని, పోలవరం ప్రాజెక్ట్‌కు పూర్తి స్థాయి నిధులు ఇచ్చినా, రెండు కోట్ల ఉద్యోగాలలో మన వాట వచ్చి ఉంటే, రైతుల ఖాతాల్లో నిధులు వేసి ఉంటే ప్రజలు హర్షించే వాళ్లు అని చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి రెండు సార్లు ఆంధ్రప్రదేశ్‌కి పీసీసీ అధ్యక్షులుగా పనిచేశారని, మళ్లీ రెండు సార్లుగా ముఖ్యమంత్రిగా గెలిచారన్నారు. అదే పీసీసీ అధ్యక్ష బాధ్యతను వైఎస్సార్ కుమార్తెకు ఇవ్వడం గర్వంగా భావిస్తున్నట్లు చెప్పారు. నాపై నమ్మకం ఉంచినందుకు కాంగ్రెస్ నేతలకు చేతులు జోడించి ధన్యవాదాలు చెబుతున్నానన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తనను ఆంధ్రాకు రావాలని కోరుకున్నారని చెప్పారు. ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ అధికారంలో ఉందని, అంతకుముందు టీడీపీ అధికారంలో ఉందని వివరించారు. ఈ పదేళ్లలో ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రం విభజన నాటికి ఏపీకి ఉన్న అప్పులు రూ.లక్ష కోట్లు కాగా... టీడీపీ అప్పులు రూ.2 లక్షల కోట్లు అని చెప్పారు. సీఎం జగన్ చేసిన అప్పులు రూ.3లక్షల కోట్లు అని, మొత్తంగా ఈ పదేళ్లల్లో అప్పులు రూ.10లక్షల కోట్లకు చేరాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత అప్పుచేసినా... అభివృద్ధి బూతద్దం పెట్టీ చూసినా కనిపించదన్నారు. రాష్ట్రానికి రాజధాని ఉందా?, రాజధానిని కట్టగలిగారా? అని ప్రశ్నించారు. ఆంధ్ర రాష్ట్రానికి కనీసం ఒక్క మెట్రో కూడా లేదని, పదేళ్లల్లో కనీసం 10 కొత్త పెద్ద పరిశ్రమలు కూడా రాలేదన్నారు. పరిశ్రమలు వస్తే మన బిడ్డలకు ఉద్యోగాలు వచ్చేవని, కనీసం ఆంధ్రాలో రోడ్లు వేసేందుకు కూడా డబ్బులు లేవని అన్నారు. అభివృద్ధి లేదు కానీ...దళితులపై మాత్రం వంద శాతం దాడులు పెరిగాయన్నారు. ఎక్కడ చూసినా ఇసుక మాఫియా, మైనింగ్ మాఫియా నెలకొందని, దోచుకోవడం దాచుకోవడం ఇదే పని అని మండిపడ్డారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా హామీ ఇచ్చి పదేళ్లయినా ఇంతవరకు రాలేదన్నారు. ప్రత్యేక హోదా వచ్చి ఉంటే ఉద్యోగాలు, పరిశ్రమలు వచ్చి ఉండేవని చెప్పారు. హోదా రాలేదనడం కంటే, పాలకులు తేలేక పోయారని అననడమే సబబు అని వ్యాఖ్యానించారు. ఉత్తరాఖండ్‌కు హోదా ఇవ్వడం ద్వారా రెండు వేల కొత్త పరిశ్రమలు, 500 శాతం కొత్త ఉద్యోగాలు, హిమాచల్‌ప్రదేశ్‌లో హోదా ఇవ్వడం ద్వారా 10 వేల కొత్త పరిశ్రమలు వచ్చాయని వివరించారు. మనకు ప్రత్యేక హోదా తేవడంలో పాలకులు విఫలమయ్యారని, వాళ్లకు చేతకాలేదని మండిపడ్డారు. రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ ఐదేళ్లు హోదా ఇస్తామంటే... బీజేపీ పదేళ్లు ఇవ్వాలని ఊదర గొట్టిందని గుర్తుచేశారు. పదేళ్లు కాదు... 15 ఏళ్లు హోదా కావాలని చంద్రబాబు అన్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. అందుకే అప్పుడు బీజేపీతో చంద్రబాబు పొత్తు పెట్టుకున్నారని, మోదీ కేబినెట్ లో మంత్రి పదవులు తీసుకున్నారని గుర్తుచేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక హోదా పక్కన పెట్టీ ఉద్యమం చేసే వాళ్లపై కేసులు పెట్టారని దుయ్యబట్టారు. ఇక జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నంత కాలం రోజూ హోదా అనేవారని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ కేంద్రంపె అవిశ్వాసం పెడతానని... టీడీపీ మద్దతిస్తే, మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తే ఎందుకు రాదు హోదా అని జగన్ చెప్పారన్నారు. జగన్ సీఎం అయ్యాక ఒక్కసారి కూడా ఉద్యమం చేయలేదని, స్వలాభం కోసం రాష్ట్ర ప్రయోజనాలను వైసీపీ తాకట్టు పెట్టిందన్నారు. ప్రత్యేక హోదా కాదు కదా, కనీసం ఒక్క ప్యాకేజీ కూడా లేదని విమర్శించారు. ఈ పాపం ముమ్మాటికీ చంద్రబాబు, జగన్‌దేనని ఆమె స్పష్టం చేశారు. స్వలాభం కోసం రెండు పార్టీలు రాష్ట్రాన్ని తాకట్టు పెట్టాయని మండిపడ్డారు. ఇక అమరావతి రాజధాని అని చంద్రబాబు అన్నారని, అమరావతిని సింగ్‌పూర్ చేస్తానని, 3డీ గ్రాఫిక్స్ చూపించారన్నారు. అటు జగన్ మూడు రాజధానులను ప్రకటించి ఒక్క రాజధానినీ కట్టలేక పోయారన్నారు. మన రాజధాని ఏది అంటే మనకే తెలియదని... ఇదేనా చంద్రబాబు, జగన్ సాధించిన అభివృద్ధి అని సూటిగా ప్రశ్నించారు. నాడు వైఎస్ఆర్ పోలవరం ప్రాజెక్టును ప్రారంభించారని, వైఎస్ఆర్ ఉన్నప్పుడు కుడి, ఎడమ కాల్వలను పూర్తిచేశారన్నారు. ఆయన చనిపోయాక ఒక్క అడుగు పోలవరం ప్రాజెక్టు ముందుకు పడలేదన్నారు. బీజేపీ అధికారంలో పదేళ్లు ఉండి, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని, ఆ రెండు కోట్ల ఉద్యోగాలలో ఆంధ్రాకు ఎన్ని వచ్చాయంటూ సూటిగా ప్రశ్నించారు. కొత్త ఉద్యోగాలేమో గానీ ఉన్న ఉద్యోగాలు ఊడి పోయే పరిస్థితి దాపురించిందని విమర్శించారు. ఆంధ్రాకు లక్ష ఉద్యోగాల్ని బీజేపీ ఎందుకు ఇవ్వలేక పోయిందని దుయ్యబట్టారు. దేశంలో బీజేపీ అధికారంలో ఉండి రైతులను మోసగించిందని, అప్పు లేని రైతు దేశంలో ఎక్కడా లేదన్నారు. స్విస్ బ్యాంక్ నుంచి డబ్బు వెనక్కు తెచ్చి రైతుల అకౌంట్ లో వేస్తామని బీజేపీ హామీ ఇచ్చి నిలువునా మోసగించిందని, ఒక్క రైతు అకౌంట్ లో అయినా డబ్బులు పడ్డాయా?అని నిలదీశారు. సీఎం జగన్ క్రైస్తవుడై ఉండి కూడా మణిపూర్ ఘటన మీద స్పందించలేదన్నారు.

మణిపూర్‌లో రెండు వేల చర్చిల మీద దాడులు జరిగితే ఒక్క రోజు కూడా విమర్శ చేయలేదని, క్రైస్తవుల మనోభావాలు దెబ్బతింటూ ఉంటే స్పందించలేదని, టీడీపీ సైతం అదే వైఖరితో ఉందన్నారు. బీజేపీకి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పూర్తి వ్యతిరేకి అని షర్మిల అన్నారు. బీజేపీ మతతత్వ పార్టీ అని, మతం పేరుతో చిచ్చు పెట్టాలని, చలి కాచుకోవాలనేదే బీజేపీ మంత్రం అని వివరించారు. వైఎస్ఆర్ ఆశయాలు ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నెరవేరాయని... ఆయన మూలాలు, ఊపిరీ కాంగ్రెస్ పార్టీనేనని స్పష్టం చేశారు. వైఎస్ఆర్‌ను ప్రేమించే ప్రజలంతా ఆయన ఆశయాల కోసం నిలబడాలని, తనతో చేతులు కలపాలని కోరారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్ఆర్ ఆశయాలను సిద్ధింపజేయడానికి నేను సిద్ధమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, విజయవాడ నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు, రాష్ట్ర, నగర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

అయోధ్యలో భూమి బూమ్!

(మొదటిపేజీ తరువాయి)

ఉందన్న ఆరోపణలూ వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ముస్లిం సమాజానికి చెందిన వక్ఫ్ భూములపై వారి కన్ను పడింది. అయోధ్యలో 'భూమి బంగారం కంటే ఖరీదైనది' అని అంటున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం ప్రారంభించనున్న ఆలయానికి లక్షలాది మంది ప్రజలు వస్తారని భావించిన పెట్టుబడిదారులు సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించడంతో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రామమందిర నిర్మాణం ప్రారంభమైన నాటి నుంచి స్థానిక రైతులు అనేక మంది బడా బాబుల మాయాజాలంలో పడి తమ భూములను తక్కువ ధరకే అమ్ముకుని తీవ్రంగా నష్టపోయారు.

వక్ఫ్ భూములపై కన్ను...

అయోధ్యలో భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ముస్లిం సమాజానికి చెందిన భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శ్మశానవాటికలు, మసీదులు, ఈద్గాలు సహా వక్ఫ్ బోర్డుకు చెందిన 200 కంటే ఎక్కువ ఆస్తులు ఇప్పటికే ల్యాండ్ మాఫియాచే ఆక్రమణకు గురయ్యాయని సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డు ఉప కమిటీ అధ్యక్షుడు (అయోధ్య) ఎండీ అజం ఖాద్రీ తెలిపారు. '1992లో అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేసినప్పటి నుంచి మా ఆస్తులు, ప్రధానంగా శ్మశాన వాటికలు, ఈద్గాలపై ఆక్రమణ కేసులు ఉన్నాయి. అయితే వివాదాస్పద స్థలంలో ఆలయ నిర్మాణానికి అనుమతిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు తర్వాత గత ఐదేళ్లలో ఆక్రమణలు పెరిగాయి' అని ఖాద్రీ వివరించారు. ఈ సమస్యపై జిల్లా ఉన్నతాధికారులకు, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు, ప్రధాని మోదీకి లేఖలు రాసి వారి జోక్యం కోరుతూ ఫిర్యాదు చేసినా ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన వివరించారు. భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, కానీ అధికారులు ఈ విషయంలో ఏమీ చేయలేదన్నారు. అయితే ఈ విషయంపై తనకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అయోధ్య అభివృద్ధి మండలి (ఏడీఏ) వైస్ చైర్మన్ విశాల్ సింగ్ తెలిపారు.

ఇప్పటికే నష్టపోయిన రైతులు

రామ్ సూరత్ వర్మ 2019లో తన భూమిని విక్రయించాలని తీసుకున్న నిర్ణయంపై విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజధాని లక్నో నుంచి 155 కిమీ దూరంలో అయోధ్య జిల్లా, తక్‌పురా గ్రామంలో ఉన్న ఈ రైతు తన 1.55 ఎకరాల భూమిని విక్రయించినప్పుడు తక్కువే అందుకున్నాడు. 65 ఏళ్ల ఈ రైతు తన నిర్ణయాన్ని ఇప్పటికి ఆలస్యం చేస్తే కనీసం 10 రెట్లు సంపాదించగలిగేవాడినని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. 'ఇక్కడ బంగారం కంటే భూమి ఖరీదైనది. 2019లో రామమందిర నిర్మాణానికి సంబంధించిన తీర్పును సుప్రీం కోర్టు వెలువరించినప్పటి నుంచి ధరలు పెరుగుతున్నాయి. 'తీర్పునకు ముందే నా భూమిని విక్రయించి తప్పు చేశాను. నేను భూమి ఒప్పందాన్ని ఆలస్యం చేసి ఉంటే, అది నాకు అప్పుడు లభించిన దానికంటే చాలా మెరుగైన ధరను పొందేవాడిని' అని వర్మ తెలిపారు. ఆలయ ప్రారంభోత్సవం తర్వాత లక్షలాది మంది పర్యాటకులు అయోధ్యను సందర్శిస్తారని అంచనా వేస్తూ పెట్టుబడి అవకాశాలను వినియోగించుకోవడం ప్రారంభించిన వ్యవస్థాపకులకు ఇది కొత్త వ్యాపార మార్గాలను కూడా తెరిచింది. అయోధ్యలోని ప్రాపర్టీ డీలర్ వినయ్ కుమార్ వర్మ మాట్లాడుతూ హోటళ్లను నిర్మించడానికి స్థలం లభ్యత గురించి ఆరా తీస్తుంటే స్థానిక భూ యజమానులెవరూ ఇప్పుడు స్పందించడం లేదన్నారు. హోటళ్లు, అతిథి గృహాలను నిర్మించడానికి ఆసక్తి ఉన్న ఇతర రాష్ట్రాల వ్యాపారుల నుంచి వస్తున్న అభ్యర్థనలు ఇక్కడి భూముల ధరలను పెంచుతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా రంగంలోకి దిగారు.

ముంబైకి చెందిన హౌస్ ఆఫ్ అభినందన్ లోధా 25 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ దాదాపు 10 వేల చదరపు అడుగుల భూమిని కొనుగోలు చేశారు. హిందువులకు ఆధ్యాత్మిక కేంద్రంగా మారే మార్గంలో అయోధ్యలో కొత్త టౌన్‌షిప్ శివార్లలో నిర్మించడానికి రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. దీని కోసం 450 ఎకరాలు త్వరలో రైతుల నుంచి సేకరించాలని యోచిస్తోంది. టౌన్‌షిప్‌లో అతిథి గృహాలను నిర్మించడానికి బీజేపీ పాలిత ఉత్తరాఖండ్, గుజరాత్ రాష్ట్రాలకు యూపీ ప్రభుత్వం భూమిని కేటాయించింది. కాగా, స్థానిక రైతులు భూ ఒప్పందాలలో జాగ్రత్తగా ఉండాలన్న సూచనలూ వస్తున్నాయి.

25వేలు దాటిన మరణాలు

(మొదటిపేజీ తరువాయి)

లక్షల జనాభాలో దాదాపు 6 లక్షల మంది ఆకలితో అలమటిస్తున్నారని ఐక్యరాజ్యసమితి అధికార వర్గాలు చెబుతున్నాయి. గాజాలోని 23 లక్షల మంది ప్రజల్లో 19 లక్షల మంది నిరాశ్రయులు కాగా, వారిలోనూ పది లక్షల మంది మహిళలు, బాలికలే. మూడు వేల మంది మహిళలు వితంతువులు కాగా, పది వేల మంది బాలలు తండ్రులను కోల్పోయారు. ఇజ్రాయిల్, హమాస్ యుద్ధంలో ప్రధాన బాధితులు స్త్రీలు, పిల్లలేనని ఐక్యరాజ్య సమితి మహిళా సంస్థ యూఎన్ ఉమెన్ ప్రకటించింది. 100 రోజులుగా సాగుతున్న యుద్ధంలో 15వేలకు మంది పైగా మహిళలు, పిల్లలు మరణించారని తెలిపింది. గంటకు ఇద్దరు తల్లులు మరణిస్తున్నారని పేర్కొంది.

సిరియా, లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులు

సిరియా, లెబనాన్‌లపై శనివారం ఇజ్రాయిల్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. ఇరాన్ సైనిక సలహాదారులను, హెజ్‌బుల్లా కమాండర్లను హతమార్చింది. సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ భవనంపై శనివారం ఇజ్రాయిల్ వైమానిక దాడి చేసింది. ఈ ఘటనలో ఆరుగురు మరణించారు. మరో నలుగురు గాయపడ్డారు. పశ్చిమ డమాస్కస్‌లోని మజ్జెలో ఓ భవనంలో ఇరాన్ సైనికాధికారుల సమావేశం జరుగుతుండగా ఈ దాడి జరిగింది. ఇందులో ఐదుగురు ఇరాన్ అధికారులు, ఒక సిరియన్ మృతి చెందారు. చనిపోయిన ఐదుగురూ ఇరాన్ సైనిక సలహాదారులే. జనరల్ సాదెగ్ ఒమిద్‌జాదే, అతడి డిప్యూటీ చనిపోయిన వారిలో ఉన్నారని స్థానిక వార్తా సంస్థ నౌర్ న్యూస్ వెల్లడించింది. మరోవైపు చనిపోయిన వారిలో ముగ్గురు ఇరాన్ కమాండర్లు ఉన్నారని సిరియా మానవ హక్కుల సంస్థ ఒకటి తెలిపింది. నలుగురు శిథిలాల కింద చిక్కుకుపోయారని వివరించింది. దాడి జరిగిన ఈ ప్రాంతంలోనే లెబనాన్, ఇరాన్ రాయబార కార్యాలయాలున్నాయి. గత కొన్నేళ్లుగా సిరియాపై ఇజ్రాయిల్ దాడులు చేస్తోంది. సిరియాలో దాడి చేసిన కొన్ని గంటల తర్వాత దక్షిణ లెబనాన్‌లోని పోర్టు నగరం టైర్‌పై ఇజ్రాయిల్ డ్రోన్ దాడి చేసింది. ఈ ఘటనలో కారులో వెళ్తున్న ఇద్దరు హెజ్‌బుల్లా సభ్యులతోపాటు మరో ఇద్దరు మృతి చెందారు.

నెతన్యాహు ఇంటి ముందు బందీల బంధువుల నిరసన

హమాస్ చెరలో బందీలుగా ఉన్నవారి బంధువులు శనివారం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఇంటి ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. బందీలను విడిపించడంలో జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. '105 రోజులుగా బందీల విడుదల కోసం విజ్ఞప్తులు చేస్తున్నాం. ప్రభుత్వం ఇకనైనా స్పందించి సాహసోపేత నిర్ణయాలు తీసుకుని బందీలను విడిపించాలి' అని ఆందోళనకారులు డిమాండు చేశారు.

"ప్రాణ ప్రతిష్ఠకు" అంతా సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఆరు దేవాలయాలు ఉన్నాయి. అయోధ్యలో రాముడి దర్శనం చేసుకోవాలన్న భక్తుల కల నెరవేరబోతోంది అని రామ మందిర నిర్మాణ కమిటీ అధ్యక్షుడు నృపేంద్ర మిశ్రా చెప్పారు.

ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవానికి అనేక అంతరువులలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. హనుమాన్ గఢీ, అష్రాఫీ భవన్ ప్రాంతాలలో నిరంతరం పోలీసులు గస్తీ తిరుగుతున్నారు. ఉత్తరప్రదేశ్ పోలీసు విభాగంలోని తీవ్రవాద వ్యతిరేక బృందాన్ని కూడా బందోబస్తు కోసం నియమించారు. సీసీ కెమెరాలతో పాటు నిఘా కోసం కృత్రిమ మేధస్సునూ వినియోగిస్తున్నారు. వివిధ భాషలు మాట్లాడే భద్రతా సిబ్బందిని నియమించారు. దాదాపు వెయ్యేళ్లు మనగలిగేలా నిర్మించిన ఈ ఆలయానికి ఎక్కడా ఇనుము, ఉక్కు వాడలేదట. మొదటి అంతస్తులో ప్రధాన దేవాలయం అందులో బాల రాముడి విగ్రహం ఉంటాయి. ఈ భాగం నిర్మాణం పూర్తి అయిందని నృపేంద్ర మిశ్రా తెలిపారు. నిర్మాణం పూర్తి కాకుండానే ప్రాణ ప్రతిష్ఠ చేస్తున్నారన్న ఆరోపణలకు బదులుగా ఆయన ఈ మాట చెప్పినట్టున్నారు.

మందిర నిర్మాణం పూర్తి కాకుండానే ఆలయాన్ని ఎలా ప్రారంభిస్తారని ఉత్తరాన ఉత్తరాఖండ్, తూర్పున ఒడిశా, దక్షిణాదిన కర్నాటక, పశ్చిమాన గుజరాత్‌లో ఆది శంకరుడు నెలకొల్పారంటున్న నాలుగు పీఠాధిపతులైన శంకరాచార్యులు మాత్రం ఈ ప్రాణప్రతిష్ఠాపనోత్సవానికి హాజరు కావడం లేదు. ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షులుగా ఉన్న నృపేంద్ర శర్మ ఉద్యోగ విరమణ చేసిన ఐఏఎస్ అధికారి. ఆయన 2014 నుంచి 2019 దాకా ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రెటరీగా పని చేశారు.

భారతీయ సంస్కృతి విజయం: రామ మందిర ప్రతిష్ఠాపనోత్సవం హిందూవుల విజయమే కాక భారత నాగరికతకూ విజయం అని అసోం ముఖ్యమంత్రి హిమంత విశ్వ శర్మ అన్నారు. ముస్లింలు, క్రైస్తవులు ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరపాలని ఆయన అభ్యర్థించారు. బాబర్ హిందువులు పవిత్రంగా భావించే దేవాలయాన్ని కూల్చేశాడని గుర్తు చేయడం హిమంత విశ్వ శర్మ మరిచి పోలేదు.

ఆసుపత్రులకూ సెలవే: ప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా మధ్యాహ్నం రెండింటిదాకా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించింది. దీనిలో భాగంగా ఆసుపత్రులకూ సెలవు ప్రకటించారు. దీనివల్ల కొన్ని వేల మంది రోగులకు ఇబ్బంది కలగవచ్చు. మొదట ఢిల్లీలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) కూడా సెలవు ప్రకటించింది కనక తరవాత రద్దు చేసింది. అందరూ టీవీల్లో ఈ ఉత్సవాన్ని తిలకించడానికి వీలుగా మధ్యాహ్నం రెండున్నర దాకా సెలవు ప్రకటించామని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని వామపక్షాలు అంటున్నాయి. బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్, గోవా, హరియాణా, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, త్రిపుర, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, అసోంలో పూర్తి రోజు సెలవు ప్రకటించారు. ఒడిశాలోని బిజూ జనతా దళ్ ప్రభుత్వం కూడా పూర్తి రోజు సెలవు ప్రకటించింది. సోమవారం మార్కెట్లకు కూడా సెలవ్అని రిజర్వు బ్యాంకు తెలియజేసింది. విదేశీ మారకానికి, ఆర్థిక మార్కెట్లకు కూడా సెలవే. బొంబాయి స్టాక్ మార్కెట్, నేషనల్ స్టాక్ ఎక్స్‌చేంజికి కూడా మూసి ఉంటాయి.

స్వచ్ఛ భారత్: సోమవారం రోజున దేశంలోని అన్ని దేవాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రధాని మోదీ కోరారు. మోదీ మహారాష్ట్ర ఆలయంలో శుభ్రం చేస్తున్నట్టు ఒక నిముషం పాటు సాగే వీడియో విడుదల చేశారు. దీనిని ఆయన "స్వచ్ఛ తీర్థ్" అంటున్నారు. కేంద్ర మంత్రులు, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు వివిధ ఆలయాలలో చీపురు పట్టుకున్నారు. అత్యంత సంపద్వంతమైన బృహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్ కూడా ఆలయాలను శుభ్రం చేయాలని కోరింది. మాంసం దుకాణాల మూత:సోమవారం రోజు మాంసం, కోడి మాంసం అమ్మే దుకాణాలను కూడా మూసేయాలని ఆదేశించారు. ప్రభుత్వమే ఇలాంటి ఆదేశాలు జారీ చేయడం విచిత్రం. దేశ జనాభాలో శాకాహారులైన వారు 38 శాతంకన్నా లేరని అనేక అధ్యయనాల్లో వెల్లడైంది. టీవీలలో జనం ఈ ఉత్సవాన్ని చూడడానికి వీలుగా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఎ.కె. శర్మ ఆదేశించినా రామాలయం ఉన్న రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ లోని నోయిడాలోనే విద్యుత్ కోతలు ఉన్నాయి. కశ్మీర్, తెలంగాణలో కూడా అదే పరిస్థితి ఉంది. ఉత్తర భారతంలో విద్యుత్ కోతల వల్ల జనం చలికి వణికిపోవలసి వస్తోంది. ఛత్తీస్ గఢ్ ప్రభుత్వం అయోధ్యకు ప్రత్యేక రైళ్లు కూడా నడుపుతోంది.

నిర్మలా సీతారామన్ అసత్య ప్రచారం : రామలయంలో జరుగుతున్న ప్రత్యేక కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారాన్ని తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం నిషేధించిందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అసత్య ప్రచారానికి దిగారు. తమిళనాడులో 200 రామాలయాలున్నాయని, వీటిలో కార్యక్రమాలు ఏర్పాటు చేయనివ్వడం లేదని ఆమె ఆరోపించారు. ఈ విషయాన్ని స్టాలిన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. దేవాలయాల్లో అన్నదానాలు, ప్రత్యేక పూజలను తమ ప్రభుత్వం నిషేధించ లేదని స్టాలిన్ గట్టిగా సమాధానం ఇచ్చారు.

గిరిజన ద్రోహి చంద్రబాబు

వైసీపీ ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పద్నాలుగేళ్ల పాలనలో గిరిజనులకు సెంటు భూమైనా ఇచ్చావా చంద్రబాబూ... అని వైసీపీ ఎమ్మెల్సీ కుంభా రవిబాబు సూటిగా ప్రశ్నించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. గిరిజనుల ద్రోహి చంద్రబాబుకు మళ్లీ పరాభవం తప్పదని హెచ్చరించారు. చంద్రబాబును గిరిజనులు ఎప్పటికీ నమ్మబోరని అన్నారు. అసత్యప్రచారానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని ఆరోపించారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా... కనీసం గిరిజన శాఖకు మంత్రిని కూడా పెట్టలేదని మండిపడ్డారు. అలాంటి బాబు అరకులో గిరిజనులపై ప్రేమ నటిస్తున్నాడన్నారు. గిరిజనులకు పోడు భూములను పంచిపెట్టిన ఘనత జగన్ దేనని స్పష్టం చేశారు. జగన్ సారథ్యంలో ట్రైబల్ మెడికల్ కాలేజీ, ఇంజినీరింగ్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మించారని వివరించారు. గిరిజనులు జగన్ ను ప్రేమిస్తున్నారని, దానిని ఓర్వలేక చంద్రబాబు దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

కోడికత్తి శ్రీను తల్లి, సోదరుడిని పరామర్శించిన మాజీ మంత్రి ఆనందబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : విజయవాడలోని ప్రభుత్వాస్పత్రిలో కోడికత్తి శ్రీను తల్లి, సోదరుడిని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఆదివారం పరామర్శించారు. కోడికత్తి శ్రీను తల్లి, సోదరుడి దీక్షను భగ్నం చేసి వైద్యం కోసం వారిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లిన విషయం విదితమే. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దేవతోటి నాగరాజు, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జ్యోతి బసు, జయపాల్, సమతా సైనిక్ దళ్ సభ్యులు, దళిత సంఘాల ప్రతినిధులు తదితరులు వారిని పరామర్శించారు. నక్కా ఆనందబాబు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో హత్యలు చేసిన వ్యక్తులు మూడు నెలల్లో బయటకు వస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవరు, దళితుడైన సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసి ఆరు నెలల్లో బయటకు వస్తే రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలికారని మండిపడ్డారు.

సమరశీల పోరాటాలతోనే సమ సమాజ స్థాపన

కమ్యూనిస్టు నేతల ఉద్ఘాటన

విశాలాంధ్ర -ఏలూరు: అక్టోబరు సోషలిస్టు విప్లవ సారథి లెనిన్‌ను ఆదర్శంగా తీసుకుని బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా శ్రమ జీవులను ఏకం చేసి విప్లవ పోరాటాలు చేయడం ద్వారానే సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకులు ఉద్ఘాటించారు. లెనిన్ శతవర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ఇక్కడి సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ, సీపీఎం జిల్లా సమితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. విశాలాంధ్ర ప్రచురణాలయం, ప్రజాశక్తి బుక్ హౌస్ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన లెనిన్ చిత్రపటంతో ఉన్న క్యాలెండర్‌ను, లెనిన్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మార్క్సిజం వర్ధిల్లాలి... లెనినిజం వర్ధిల్లాలి... సమ సమాజ స్థాపన జరగాలి...ఫాసిస్టు ప్రభుత్వాలు నశించాలి.... జోహార్ లెనిన్... అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ లెనిన్ స్ఫూర్తితో సోషలిస్టురాజ్య స్థాపనకు కమ్యూనిస్టులు అందరూ నడుంబిగించాలన్నారు. శ్రమజీవుల కోసం ఎన్నో విప్లవ పోరాటాలు చేసిన లెనిన్‌ను ప్రపంచం అంతా ఇప్పుడు స్మరించుకుంటోందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ లెనిన్ మరణించి వంద సంవత్సరాల అయినప్పటికీ ప్రజల మనసుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ .రవి మాట్లాడుతూ లెనిన్ స్ఫూర్తితో సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని ప్రపంచం గుర్తించిందన్నారు. భూస్వాములు, సామ్రాజ్య వాదులు, పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా భారతదేశంలో కూడా కార్మిక ,కర్షక ,కష్టజీవులను ఏకం చేసి విప్లవం ద్వారా ముందుకు వెళ్లి శ్రామిక రాజ్యాన్ని సాధించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి. హేమ శంకర్, సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే, ప్రధాన కార్యదర్శి కే.బుచ్చిబాబు, సీపీఎం నగర కార్యదర్శి పి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రిలో సదస్సు

రాజ్యాంగ వ్యవస్థ స్థానే నేటి మోదీ ప్రభుత్వం మత రాజకీయాలను ప్రోత్సహిస్తూ రాజ్య వ్యవస్థను ఆయుధంగా వాడుకుంటున్నదని లౌకిక అనే పదాన్ని తొలగించేలా కుట్రలు చేస్తున్నదని సీపీఐ జాతీయ సమితి సభ్యులు తాటిపాక మధు విమర్శించారు. ఆదివారం ఉదయం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతి సందర్భంగా మతం - నేటిరాజకీయం- విస్తరిస్తున్న హిందూ జాతీయవాదం అనే అంశం పై సదస్సు జరిగింది. దీనికి సీపీఐ నగర కార్యదర్శి వి కొండలరావు అధ్యక్షత వహించారు .ముందుగా లెనిన్ చిత్ర పటానికి పూలదండలు వేసి నివాళలు అర్పించారు. ముఖ్య అధితిగా పాల్గొన్న మధు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందాలనే ఉద్దేశంతోనే అయోధ్యను దేశవ్యాప్తంగా ప్రచారం కోసం వాడుకుంటున్నారనీ, దీనికి బడా పెట్టుబడీదారి వర్గం, మీడియా వంతు పాడుతోందని చెప్పారు. లెనిన్ ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి యావత్తు ప్రపంచ అభ్యుదయ మానవాళికి వేగుచుక్క అని అన్నారు ఈ సదస్సులో జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షులు కుంద్రపు రాంబాబు, పార్టీ నాయకులు సేపని రమణమ్మ, బేగం, ఉమ, ఎం.సాగర్, నాగేశ్వరావు, కొండవతి, సుజనమ్మ తదితరులు మాట్లాడారు.

విశాఖ జిల్లాలో: సోషలిస్టు రాజ్య వ్యవస్థాపకుడు లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఐ విశాఖ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1917 అక్టోబర్ విప్లవం విజయవంతం చెయ్యడానికి లెనిన్ కృషి చేశారని అన్నారు. పటిష్ఠమైన కార్మిక వర్గ పార్టీ ఉన్నప్పుడు, పరిస్థితులు కలిసి వచ్చినప్పుడు వెనుకబడిన దేశంలో కూడా విప్లవాన్ని తీసుకురావచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, జి. ఎస్. జె.అచ్యుతరావు, షేక్ రెహమాన్, పి.చంద్రశేఖర్, సి.ఎన్. క్షేత్రపాల్, నాయకులు జి.కాసులరెడ్డి, ఎన్. నాగభూషణం, టి వి రావు, అశోక్, కె. భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లాలో: మనిషిని మనిషి దోచుకునే దోపిడీ వ్యవస్థను కూల్చి ప్రపంచంలోనే సోషలిస్టు వ్యవస్థను సోవియట్ యూనియన్‌లో ఏర్పాటుచేసి అందరూ సమానంగా బతికే విధానం తీసుకొచ్చిన మొట్టమొదటి వ్యక్తి లెనిన్ చిరస్మరణీయుడిని సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. లెనిన్ శత వర్ధంతిని అనకాపల్లిలోని సీపీఐ కార్యాలయంలో వై .ఎన్. భద్రం అధ్యక్షతన జరిగిన నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం జిల్లాలో: ఉమ్మడి విజయనగరం జిల్లాలో లెనిన్ శత వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సీపీఐ బొబ్బిలి నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో లెనిన్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, దళిత హక్కుల పోరాట సమితి నియోజకవర్గం కార్యదర్శి బొద్దాన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో: పార్వతీపురం జిల్లా ఆసుపత్రి వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఈవీ నాయుడు అధ్యక్షతన లెనిన్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మన్మధరావు లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కమ్యూనిజానికి బాటలు వేసిన మహానాయకుడు, మహోన్నతమైన వ్యక్తి లెనిన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ ఆర్.కుమార్, ఆసుపత్రి కార్మికుల జిల్లా అధ్యక్షురాలు అలజంగి కుమారమ్మ, ఏఐవైఫ్ జిల్లా అధ్యక్షులు కూరంగి గోపినాయుడు, చేతివృత్తుల సంఘం జిల్లా కార్యదర్శి సింహాద్రి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం జిల్లాలో: సోషలిస్ట్ దేశ వ్యవస్థాపకుడు లెనిన్ అని సీపీఐ సీనియర్ నాయకులు చాపర సుందర్‌లాల్ అన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళంలోని ఎన్ఆర్ దాసరి క్రాంతిభవన్‌లో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డోల శంకరరావు, చిక్కాల గోవిందరావు, మొజ్జాడ యుగంధర్, పట్టణ సహాయ కార్యదర్శి కొమర భాస్కరరావు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, మహిళా సమాఖ్య నాయకురాలు ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేసి తీరాల్సిందే

కట్టా హేమసుందరరావు

విశాలాంధ్ర-మంగళగిరి: చేనేత కార్మికులకు అవకాశాలను పెంపొందించి, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన 11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేసి తీరాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు కట్టా హేమసుందరరావు డిమాండ్ చేశారు. మిల్లు యజమానులు చట్టాన్ని ఉల్లంఘించి ఇష్టానుసారంగా వస్త్రాలు తయారు చేస్తున్నా కూడా పాలకులు, అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని శ్రీ మార్కండేయ పద్మశాలీయ కల్యాణ మండపంలో రెండు రోజులుగా జరుగుతున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర 13వ మహాసభలు ఆదివారం ముగిశాయి. ముగింపు సభకు చేనేత నాయకులు పి.గోవిందు, గొట్టుముక్కల లక్ష్మీ అధ్యక్షత వహించగా హేమసుందరరావు మాట్లాడుతూ 11 రకాల వస్త్రాలను చేనేతకు కేటాయిస్తూ 1985లో తీసుకువచ్చిన రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘించి పవర్ లూమ్ యజమానులు వస్త్రాలను తయారు చేస్తుండడంతో రోజురోజుకు చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తినే నమ్ముకుని బతుకు సాగిస్తున్న చేనేత కార్మికులకు ఉపాధి కరువై అర్థాకలితో బతుకు సాగిస్తూ ఆకలి చావులకు, ఆత్మహత్యలకు బల వుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే చేనేతకు పూర్వ వైభవం తీసుకువస్తామంటూ వాగ్దానాలు చేస్తూ అధికారంలోకి వస్తున్న పాలకులు నేతన్నను మోసం చేస్తున్నారని హేమసుందరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. చేనేత పరిశ్రమ రక్షణ కోసం, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజుల్లో చేనేత కార్మిక సంఘం నిర్వహించే పోరాటాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన ముప్పాళ్ల

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 13వ రాష్ట్ర మహాసభల సందర్భంగా నూతనంగా ఎన్నికైన సంఘ కార్యవర్గానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత రంగంపై చాలా మంది ఆధారపడి ఉన్నారని, అత్యంత ప్రాధాన్యత గల ఈ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. నూతన కార్యవర్గం చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి పరిష్కార మార్గాలు చూపాలని ఆకాంక్షించారు. యువతను చేనేత వైపు నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మీ సార్ జగన్ ఆటలు ఇక చెల్లవు

- పోలీసులకు షర్మిల హెచ్చరిక
- కాన్వాయ్‌ని అడ్డుకోవడంతో కాంగ్రెస్ కార్యకర్తల నిరసన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరించేందుకు వస్తున్న షర్మిల కాన్వాయ్‌ను పోలీసులు అడ్డుకోవడంతో ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం గన్నవరం నుంచి కాన్వాయ్ నడుమ సభా స్థలికి షర్మిల వస్తుండగా మధ్యలో మూడు వంతుల కాన్వాయ్‌ని సందులోకి పోలీసులు డైవర్ట్ చేశారు. షర్మిల వెనక్కి తిరిగి పరిస్థితిని గమనించారు. దీంతో ఆమె వాహనంతో పాటు మిగిలిన వాహనాలను నిలిపివేసి రోడ్డుపై కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు షర్మిల వద్దకు వచ్చి మాట్లాడినప్పటికీ, ముందుకు వెళ్లబోమని షర్మిల తేల్చిచెప్పారు. తాము అనుమతి తీసుకుని వెళుతుంటే అడ్డుకోవాల్సిన అవసరం ఏముందని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో నియంత పాలన నడుస్తోం దని మండిపడ్డారు. తనను చూసి మీ జగన్ సార్ భయపడుతున్నారా? అని పోలీసులను ప్రశ్నించారు. కాంగ్రెస్ కార్యకర్తల కోసం అవసరమైతే జైలుకు పోతా... అంటూ హెచ్చరించారు. ఇకపై మీ అక్రమాలు సాగవు అంటూ మీ సార్ జగన్‌కు చెప్పాలని పోలీసులకు సూచించారు. దీంతో అసలైన వైఎస్సార్ వారసురాలు వచ్చిందంటూ కార్యకర్తలు నినదించారు. అన్ని వాహనాలను మళ్లీ కాన్వాయ్‌గా ఏర్పడే వరకు ఆగి, మళ్లీ అరగంట సమయం తర్వాత సభా స్థలానికి షర్మిల బయలుదేరింది. పోలీసుల తీరుపై కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యుత్ బిల్లును ఉపసంహరించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: కేంద్రం ప్రభుత్వం విద్యుత్ చట్ట సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ సంఘాలైన ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, గ్రామ వార్డు సచివాలయాల ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం కడప జిల్లా జెడ్పీ హాల్‌లో నిర్వహించారు. ఈ బండి రామలింగారెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఓబులేసు మాట్లాడుతూ... విద్యుత్ చట్టంతో కార్మికులకు తీరని అన్యాయం జరుగు తుందన్నారు. విద్యుత్‌ను ప్రభుత్వ రంగం నుంచి వేరుచేసి అదానీ, అంబానీ వంటి ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్ చట్ట సవరణ బిల్లు వల్ల దేశ ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లను బిగించి రైతులనుంచి అధిక బిల్లులు వసూలు చేయబోతున్నారని, ఇప్పటివరకు విద్యుత్తు ఉత్పత్తి, సరఫరా, పంపిణీ విభాగాల్లో చేస్తున్నటువంటి ప్రభుత్వ ఉద్యోగులందరినీ ఇంటికి పంపటమే లక్ష్యంగా ఈ బిల్లు పనిచేస్తుందని విమర్శించారు. మరోవైపు విద్యుత్తును వినియోగదారులపైన మరింత భారం పడే విధంగా ఈ బిల్లును తయారు చేశారన్నారు. రాష్ట్రాల హక్కుల్ని కాల రాసే విధంగా ఒకే దేశం ఒకే నినాదం అంటూ రాష్ట్ర ప్రభుత్వాలను చిన్నాభిన్నం చేస్తూ ఈ బిల్లుని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారని, బిల్లును విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిం చాయని తెలిపారు. బిల్లును స్టాండింగ్ కమిటీకి బిల్లును పంపించారని దీన్ని ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. తక్షణమే విద్యుత్ సవరణ చట్టం బిల్లును ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో రైతు ఉద్యమం తరహాలో ప్రజా ఆగ్రహానికి మోదీ ప్రభుత్వం గురించి కాక తప్పదని హెచ్చరించారు. అలాగే విద్యుత్ రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, వారందరికీ సుప్రీం కోర్టు ఆదేశానుసారం సమాన పనికి సమాన వేతనాలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా నియమించిన ఎనర్జీ అసిస్టెంట్లను సచివాలయ ఉద్యోగులా లేక విద్యుత్ ఉద్యోగులా అన్నది వెంటనే ప్రభుత్వం తేల్చాలని... అంతవరకు విద్యుత్ ఉద్యోగులకు చెల్లించే అన్ని రకాల సెలవులను, ఇతర అలవెన్సులను, పాత సర్వీస్ రూల్స్ ను అమలు చేయాలని ఓబులేసు డిమాండ్ చేశారు. ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పొన్నా శివయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బాల కాశి, గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఎంతోకాలంగా సాధించుకున్న హక్కులకు కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గండి కొడుతున్నా యని, కోర్టులు కార్మికులకు అండగా తీర్పులిస్తే వాటిని పక్కన పెట్టి కార్మిక హక్కులను హరించి వేసే విధంగా నూతన చట్టాల పేరుతో బానిస వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమానికి సోహర్ద ప్రతినిధులుగా 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య, 327 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవరెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏసోబు, ఉప ప్రధాన కార్యదర్శి బ్రహ్మానంద రెడ్డి, గురుబ్రహ్మం, సీపీఐ జిల్లా కార్యదర్శి జీ చంద్ర, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డి, డిస్కం నాయకులు జయమని, సురేష్ కళ్యాణ్ చక్రవర్తి, చంద్రశేఖర్, మంజునాథ్, గంగాధర్, లక్ష్మీనారాయణ ఇబ్రహీం, చిరంజీవి, ప్రతాప్ రెడ్డి, ఈశ్వరయ్య, కొండారెడ్డి నాగిరెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు హాజరయ్యారు.

25న వెలగపూడిలో అమరావతి ఉద్యమ సభ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి ఉద్యమానికి ఈనెల 25వ తేదీతో 1500 రోజులు పూర్తవుతున్న సందర్భంగా వెలగపూడిలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. అమరావతి జేఏసీ అధ్వర్యంలో నిర్వహించే సభకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మద్దతు దారులను ఆహ్వానిస్తున్నారు. అనంతరం ఉద్యమ కార్యాచరణను వెల్లడిస్తారు. 25న నిర్వహించే సభను దృష్టిలో ఉంచుకుని నిరసన కార్యక్రమాలను రూపొందించనున్నారు. మూడు రాజధానుల పేరుతో అమరావతిని వైసీపీ ప్రభుత్వం విచ్ఛిన్నం చేసిందని, దానిపై తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధమవుతున్నట్లు జేఏసీ నేతలు చెబుతున్నారు. అమరావతి రాజధానిగా ఉండటం వల్ల రాష్ట్రానికి కలిగే లాభాలు, ఆవశ్యకత, భవిష్యత్ తదితర అంశాల్ని బహిరంగ సభలో రైతులు వివరిస్తారు. ఇప్పటికే అమరావతి రాజధాని పేరుతో రైతులు అనేక ఉద్యమాలను నిర్వహించిన విషయం విదితమే. పాదయాత్రలతో ప్రజలను చైతన్యవంతుల్ని చేశారు. నిరహార దీక్షలను నిర్వహిస్తూ... రాష్ట్రానికి అమరావతే ఏకైక రాజధానిగా ఉండాలని ఆకాంక్షిస్తున్నారు. ఒక వైపు ఉద్యమాలతోను, మరోవైపు న్యాయపోరాటాలతోనూ అమరావతి పరిరక్షణ కోసం వారు తపిస్తున్నారు. దీంతో అమరావతి ఉద్యమంలో భాగంగా పూర్తి చేసుకున్న రోజుల సంఖ్య ఆధారంగా సభలు, సమావేశాలను నిర్వహించి, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. రాబోయే ఎన్నికల్లో అమరావతే ఏకైక రాజధానిగా ఆలోచించే రాజకీయ పార్టీకే తమ మద్దతు ఉంటుందని అమరావతి జేఏసీ నొక్కిచెప్పిన విషయం విదితమే. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వారి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకుగాను ఈ సభకు సన్నద్ధమవుతున్నారు.

మావోయిస్టు స్థావరాలు ధ్వంసం

విశాలాంధ్ర-చింతూరు (అల్లూరి జిల్లా): చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో భద్రతా బలగాలు మావోయిస్టు స్థావరాలను ధ్వంసం చేశాయి. 207 సిఆర్పిఎఫ్ దళాలు, డి ఆర్ జి పోలీసులు గొల్లపల్లి కిష్టారం అటవీ ప్రాంతాల్లో విస్తృత గాలింపులు జరిపి... మావోయిస్టుల స్థావరాలను కనుగొన్నారు. కుంట, కిష్టారం మావోయిస్టు ఏరియా కమిటీలకు చెందిన క్యాంపులను ధ్వంసం చేసి... సామాన్లను కుప్పలుగా వేసి దగ్ధం చేశారు. ఈ విషయాన్ని ఎస్పీ కిరణ్ చౌహాన్ ధృవీకరించారు.

చంద్రబాబును సీఎం చేయడమే షర్మిల లక్ష్యం: సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నోటా కంటే ఓట్లు తక్కువ వచ్చిన కాంగ్రెస్‌కు రాష్ట్రంలో మనుగడ లేదని... చంద్రబాబును సీఎంను చేయాలన్నదే షర్మిల లక్ష్యంగా కన్పిస్తోందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంపై షర్మిల చేసిన వ్యాఖ్యల్ని తిప్పికొట్టారు. చంద్రబాబు కుట్రలో చివరి అస్త్రంగా షర్మిలను ప్రయోగించారన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి, వైఎస్ఆర్ కుటుంబానికి అన్యాయం చేసిందన్నారు. షర్మిల వాడిన భాష, యాస సరికాదని, వైఎస్ఆర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్ నిబద్ధతతో పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. వైఎస్ఆర్ వారసుడిగా సీఎం జగన్ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని, వైఎస్ఆర్ మరణాంతరం ఆయనకుటుంబ సభ్యులను కాంగ్రెస్ ఇబ్బందులకు గురిచేసిందన్నారు. సీఎం జగన్‌పై పెట్టినవి అక్రమ కేసులేనని... అప్పటి కాంగ్రెస్ నేత గులామ్ నబీ అజాదే చెప్పారని గుర్తుచేశారు. వైఎస్ఆర్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్పింది కాంగ్రెస్సేనని నొక్కిచెప్పారు. కాంగ్రెస్ గురించి షర్మిలకు ఏం తెలుసు? షర్మిల తెలంగాణ నుంచి ఏపీకి హఠాత్తుగా ఎందుకొచ్చారన్నారు. ఆ పార్టీ తరపున షర్మిల ఇక్కడకు వచ్చి ఏం చేస్తారని ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని షర్మిల ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో పోటీ చేస్తానన్న షర్మిల ఎందుకు వెనుకడుగు వేశారని, ఏపీలో ఎవరికి ఆయుధంలా ఉపయోగపడాలని వచ్చారో అందరికీ తెలుసని పేర్కొన్నారు. ఇదంతా చంద్రబాబు ఎత్తుగడేనని, అందుకే ఆ వర్గం మీడియా షర్మిలను భుజానికి ఎత్తుకుందని విమర్శించారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగైందని, టీడీపీ వెంటిలేటర్‌పై ఉందన్నారు. గత ఎన్నికల్లో నోటా కంటే తక్కువ ఓట్లు కాంగ్రెస్‌కు వచ్చాయని, చంద్రబాబుతో కుమ్మక్కై ఆనాడు కాంగ్రెస్ పార్టీ ఏపీకి అన్యాయం చేసిందని వివరించారు. ప్రత్యేక హోదా కోసం వైసీపీ పోరాటం కొనసాగుతూనే ఉందని, ప్రత్యేక హోదాను ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చట్టంలో పెట్టలేదని, దీనిపై షర్మిల ఖచ్చితంగా వివరణ ఇవ్వాల్సిందేనని సజ్జల అన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వైసీపీ ఎమ్మెల్యే 'ఆళ్ల'

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మంగళగిరి వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం ఆ పార్టీ అధ్యక్షురాలు షర్మిల సమక్షంలో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ నుంచి మంగళగిరి టికెట్ తిరిగి తనకు రాదని తెలిసి ఇటీవల ఆయన ఎమ్మెల్యే పదవికి, పార్టీకి రాజీనామా చేసిన విషయం విదితమే. ఆయన రాజీనామా స్పీకర్ పరిశీలనలో ఉంది. షర్మిల కాంగ్రెస్‌లోకి వచ్చిన అనంతరం ఆళ్ల రామకృష్ణారెడ్డి కూడా తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించిన విషయం విదితమే. సీఎం వైఎస్ జగన్‌కు ఆర్కే అత్యంత సన్నిహితుడిగా ఆయన ఉన్నారు. మంగళగిరి నుంచి వైసీపీ తరపున రెండు విడతలుగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీడీపీ ప్రభుత్వంపై, రాజధాని భూముల వ్యవహారంపైన, చంద్రబాబు ఓటుకు నోటు కేసు విషయంలోనూ ఆయన న్యాయపరంగా పోరాటం చేశారు. 2029 ఎన్నికల్లో టీడీపీ నేత నారా లోకేశ్‌పై ఆయన విజయం సాధించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆయనకు మంత్రి పదవి దక్కలేదనే అసంతృప్తిగా ఉన్నట్లు ప్రచారముంది. దాంతోపాటు రాబోయే ఎన్నికల్లో మంగళగిరి వైసీపీ ఇన్‌చార్జిగా బీసీ సామాజి వర్గానికి చెందిన గంజి శ్రీనివాస్‌ను అధిష్ఠానం నియమించింది. ఈ విషయం ముందే తెలిసినందునే ఆర్కే తన పదవులకు రాజీనామా చేసినట్లు సమాచారం. ఇప్పటికే వైసీపీలో ఇన్‌చార్జి పదవులు దక్కని చాలా మంది ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉండగా... ఆర్కే బాటలోనే మరి కొందరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

అంగన్‌వాడీల సమస్యలపై

కోటి సంతకాలతో 'సీఎంకు చెబుదాం'

- నేడు విజయవాడకు తరలిరానున్న మద్దతుదారులు
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కార్మికులకు మద్దతుగా 'జగనన్నకి చెబుదాం రండి' అనే నినాదంతో కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల నేతృత్వంలో పెద్ద ఎత్తున మద్దతుదారులు సోమవారం విజయవాడకు తరలి వస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ తెలిపారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్టీయూ సంయుక్త అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మూడు సంఘాల జేఏసీ నేతల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె 41 రోజులుగా కొనసాగుతుండగా... గాంధీనగర్ ధర్నా చౌక్ వద్ద శిబిరంలో నిరవధిక నిరాహార దీక్షలు ఐదో రోజుకు చేరాయన్నారు. జగన్ ప్రభుత్వం సమస్య పరిష్కారం చేయకుండా కలెక్టర్లు ఇతర అధికారులతో బెదిరించాలని ప్రయత్నించినా, కార్మికులు మొక్కవోని దీక్షతో సమ్మె కొనసాగిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వం చర్చలు జరపకుండా దాటవేసే ధోరణి అవలంబిస్తోందన్నారు. కార్మికులకు మద్దతుగా సోమవారం విజయవాడకు వస్తున్న వారికి ప్రభుత్వం, అధికారులు సహకరించాలన్నారు. ఆటంకం కలిగిస్తే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ 41 రోజులుగా అంగన్‌వాడీల పోరాటానికి ప్రజలు, సంఘాల నుండి పూర్తి మద్దతు లభిస్తోందన్నారు. కోటి సంతకాలతో జగనన్నకు విజ్ఞాపన సమర్పించేందుకు విజయవాడ తరలిరానున్నారన్నారు. జగన్ ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలను కార్మిక వర్గం వ్యతిరేకిస్తూనే ఉంటుందన్నారు. అంగన్‌వాడీల సమస్యలు త్వరగా పరిష్కరించుకుంటే ప్రభుత్వ పతనం తప్పదని హెచ్చరించారు. ఐఎఫ్టీయూ రాష్ట్ర కార్యదర్శి పోలారి మాట్లాడుతూ... మొండిగా వ్యవహరిస్తున్న జగన్ ప్రభుత్వం ఇప్పటికైనా వైఖరిని మార్చుకుని అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు.

ఏయూకు రూ 1.30 కోట్ల విలువైన ల్యాబ్ ఉపకరణాలు

విశాలాంధ్ర-విశాఖసిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రూ1.30 కోట్ల విలువైన ప్రయోగశాల ఉపకరణాలను వయాట్రిస్ ఫార్మసీ సంస్థ తరపున అందిస్తున్నట్లు ఆ సంస్థ క్వాలిటీ ఇన్వెస్టిగేషన్స్ -రెగ్యులేటరీ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ దేవ పురాణం తెలిపారు. ఈ మేరకు ఆదివారం తమ సంసిద్ధతను ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డికి తెలియజేశారు. వయాట్రిస్ సంస్థ సీఎస్ఆర్ విధానంలో భాగంగా వయాట్రిస్ ఇండియా అధిపతి మిచెల్ డొమినికా నేతృత్వంలో ప్రయోగశాల ఉపకరణాలను ఏయూకు అందిస్తున్న విషయం దేవ పురాణం ప్రకటించారు. వర్సిటీకి ఉపయుక్తంగా నిలిచే హెచ్‌పీఎల్సీ, స్పెక్ట్రో ఫోటోమీటర్లు, హ్యుమిడిటీ అండ్ కూలింగ్ చాంబర్స్, ఎలక్ట్రానిక్ అనలిటికల్ బ్యాలెన్సెస్, సెంట్రిఫ్యూజిస్, పోలరీమీటర్, రిఫ్రాక్టోమీటర్, వాటర్ ప్యూరిఫికేషన్ సిస్టమ్ వంటివి ఏయూకు వయాట్రిస్ అందజేయనుంది. ఈ పరికరాలను ఏయూ ఫిజికల్ కెమిస్ట్రీ, ఫార్మసీ, ఎలిమెంట్ (ఏ సెంట్రల్ హై ఎండ్ ఇనుస్ట్రుమెంట్ ల్యాబ్)లలో వినియోగించాలని దేవ పురాణం సూచించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం గత నాలుగున్నర సంవత్సరాల కాలంలో అద్వితీయ ప్రగతిని సాధించిందని దేవ పురాణం అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఏయూ విద్యార్థులు రాణించే విధంగా ఏయూలో బోధన, పరిశోధన పటిష్టం చేస్తూ నూతన ప్రాజెక్టులను నిర్వహించారన్నారు. కాగా ఏయూలో ఉన్నత విద్యను అభ్యసించిన దేవ పురాణం తన ప్రగతికి కారణమైన ఏయూను మరువలేదు. ఇప్పటికే తన తల్లిదండ్రులు లలితాదేవి, కోటిలింగాల మూర్తి పేరుమీదుగా ఫార్మసీ విద్యార్థినుల హాస్టల్ భవనాన్ని నిర్మించారు. ఇటీవల తాను చదువుకున్న కెమిస్ట్రీ విభాగంలో అధునాతన సమావేశ మందిరాన్ని అభివృద్ధి పర్చారు. ఇప్పుడు మరో పర్యాయం ఏయూకు విలువైన ప్రయోగ పరికరాలను అందించడానికి ముందుకువచ్చారు. ఈ సందర్భంగా దేవ పురాణం సహృదయతకు వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్ కృతజ్ఞతలు తెలిపారు.

సాహితి

మాతృభాష ప్రాధాన్యాన్ని చాటి చెప్పిన 'గిడుగు'

డా॥ పి.వి. సుబ్బారావు
సెల్: 9849177594

పరభాషా వ్యామోహంతో అమ్మ భాషను నిర్లక్ష్యం చేయడం నేరం. భాషను రక్షించుకోవడం సామాజిక అవసరం. 'దేశ క్షేమానికి భాషా క్షేమం పునాది' అని వ్యవహారిక భాషాఉద్యమకారుడు గిడుగు రామ్మూర్తి పంతులు చాటి చెప్పారు. గిడుగువారి కృషి బహుముఖాలుగా సాగింది. ఆయన మహా పండితులు. ఉత్తమ విమర్శకులు. గొప్ప పరిశోధకులు. శాసన పరిశోధకులు. గ్రంథ పరిష్కర్త. ప్రత్యేకించి సవరభాష కోసం గణనీయమైన కృషి చేసిన భాషా సేవకులు. గిడుగు వారు 1863 ఆగస్టు 29 వ తేదీన శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేటలో జన్మించారు. ఆయన తండ్రి వీర్రాజు సాధారణ ఉద్యోగి. తల్లి వెంకమ్మ గృహిణి. గిడుగు వారికి బాల్యంలో వారణాసి గున్నయ్యశాస్త్రి అక్షరా భ్యాసం చేశారు. తండ్రి దగ్గర భారత, భాగవత, రామాయణాలు నేర్చుకున్నారు. ఆయన 12వ ఏట తండ్రి మరణించే సమయంలో కొడుకు బాధ్యతలను సమీప బంధువు కాళ్లూరి విశ్వనాథంకి అప్పగించారు.

గిడుగు వారికి గురజాడవారు సహాధ్యాయి. 1879లో మెట్రిక్యులేషన్ పరీక్ష పాసయ్యారు. మెట్రిక్యులేషన్ తరువాత కొన్నాళ్లు కలెక్టరు కార్యాలయంలో గుమస్తాగా చేశారు. 1879 లో ఆయన వివాహం అన్నపూర్ణమ్మతో జరిగింది. 1880లో 'పర్లాకిమిడి' సమీపంలో సవర గిరిజనులుండే ప్రాంతంలో ఐదు రూపాయలు అధిక వేతనానికి ఆశపడి 35 రూపాయల వేతనంతో ఉపాధ్యాయుడిగా చేరారు. పర్లాకిమిడి మిడిల్‌స్కూల్‌ను రాజావారు హైస్కూల్‌గా చేయాలని నిర్ణయించడంతో ఎఫ్.ఎ ప్రథమశ్రేణిలో కృతార్థుడై 1882లో హైస్కూల్ ఉపాధ్యాయుడిగా పదోన్నతి పొందారు. తమ హైస్కూల్ కళాశాల అవుతుందని తెలిసి, 1895లో బి.ఏ ప్రథమశ్రేణిలో కృతార్థుడై కళాశాల లెక్చరరుగా పదోన్నతిని పొందారు. 1911లో 48ఏళ్లకే స్వచ్ఛంద పదవీవిరమణ చేసి, పూర్తి సమయాన్ని తెలుగు భాషా సాహిత్యాల సేవకు వినియోగించారు.

వ్యవహారిక భాషా ఉద్యమ నేపథ్యం

భాషకు మార్పు సహజమనీ, ఎప్పటికప్పుడు మారుతుందనీ, శిష్ఠ వ్యవహారంలో ఉన్న భాషనే ప్రజలు వాడుక భాషగా ఉపయోగించాలన్న లక్ష్యంతో వ్యవహారిక భాషాఉద్యమం వచ్చింది. 1906లో జె.ఎ.ఏట్స్ అనే ఆంగ్లేయుడు విశాఖపట్టణం, గంజాం, గోదావరి జిల్లాలకు విద్యా పర్యవేక్షణాధికారిగా వచ్చారు. తెలుగు భాష మీద మమకారంతో ఆయన తెలుగు నేర్చుకున్నారు. తానునేర్చిన తెలుగుకు, పుస్తకాల్లో ఉన్న గ్రాంథిక భాషకు వ్యత్యాసం ఉందని గమనించారు. ఆ విషయాన్ని అప్పటి విశాఖపట్టణం ఏవియన్ కళాశాల ప్రిన్సిపాల్ పి.టి.శ్రీనివాస అయ్యంగారితో చర్చించారు. తెలుగు భాషలో తనకంటే ప్రావీణ్యం ఉన్న గురజాడ అప్పారావును, గిడుగు రామ్మూర్తి పంతులుని ఏట్స్‌కు పరిచయం చేశారు. వారిద్దరూ గ్రాంథిక, వ్యవహారిక భాషాభేదాలపై 'ఏట్స్' సందేహాలను నివృత్తి చేశారు. ఆ సంఘటన ప్రభావంతో గిడుగు వారు విద్యారంగంలో గ్రాంథిక భాషను ఉపయోగించకుండా వ్యవహారిక భాషను ఉపయోగించాలన్న లక్ష్యంతో మహోద్యమాన్ని చేపట్టారు. ఆ ఉద్యమం కోసం ఆయన జీవితాన్ని అంకితం చేశారు. గ్రాంథికభాష మృతభాష వంటిదని నిరసించారు. తద్వారా గిడుగువారు గ్రాంథిక భాషావాదుల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. వ్యవహారికభాష కోసం 1910 నుండి 1914 వరకు గణనీయమైన కృషి చేశారు.

గ్రాంథిక భాషావాదులెందరో వ్యవహారిక భాషోద్యమాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. గిడుగు వారికి పాండిత్యం లేదని అవహేళన చేశారు. వారికి సమాధానంగా మహాకవుల, పండితుల రచనల్లో భాషా దోషాలను, వ్యవహారిక రూపాలను గిడుగు ఎత్తిచూపుతూ 'ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం' అనే గ్రంథాన్ని రాశారు. అంతేకాకుండా ప్రాచీన కావ్యాల్లో తప్ప, ఆనాటి కవులు, పండితులు టీకలు, టిప్పణులు, శాసనాలు, వ్యాఖ్యానాలు వంటి వాటిలో వ్యవహారికభాషనే ఉపయోగించారని నిరూపించారు. అందుకోసం ఎంతో శ్రమించి, తాళపత్ర గ్రంథాలను పరిశీలించి బాలకవి శరణ్యం, గద్య చింతామణి అనే గ్రంథాలు రాశారు.

వ్యవహారిక భాషా ఉద్యమంలో గిడుగువారికి గురజాడవారు అండగా నిలిచి, వ్యవహారిక భాషకు లక్ష్యాలుగా 'కన్యాశుల్కం' నాటకాన్ని, 'ముత్యాలసరాలు' కవితా సంపుటిని ప్రచురించారు. మద్రాసు విశ్వవిద్యాలయం కాంపోజిషన్ కమిటీసభ్యులుగా గురజాడ, గిడుగులు ఉన్నతపాఠశాల స్థాయిలో ఉపవాచకాన్ని వ్యవహారికభాషలో ఉన్న రచనను ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదన చేశారు. ఆ కమిటీలో గ్రాంథిక భాషావాదుల ఆధిపత్యంతో ఆ ప్రతిపాదన వీగిపోయింది. గురజాడ 1914లో ఆధునిక తెలుగు భాష స్వరూపాన్ని వివరిస్తూ 'డిసెంట్' (అసమ్మతి) పత్రాన్ని ప్రకటించారు. గిడుగువారు ఎ మెమోరాండమ్ ఆన్ మోడరన్ తెలుగు ప్రోజ్'- అనే గ్రంథాన్ని రాశారు. తనకు అండగా నిలిచిన గురజాడ 1915లో మరణించడం ఎంతో ఆవేదన కలిగించింది. ఆయన ఒంటరి పోరాటాన్ని సాగించారు. 1916లో గిడుగువారు కొవ్వూరులో జరిగిన పండిత సదస్సులో 'జీవద్భాష' ప్రాశస్త్యాన్ని గూర్చి సుదీర్ఘ ప్రసంగం చేసి వీరేశలింగంని మెప్పించి, తనకు అండగానిలిచేట్లు ఒప్పించారు. వీరేశలింగం 1919లో మరణించటంతో ఒంటరిపోరాటాన్ని సాగించారు. గిడుగువారు 1940లో మరణించిన తర్వాత చాలా కాలానికి ఆయన పోరాట దీక్ష ఫలించి వ్యవహారికభాష అమల్లోకి వచ్చింది. శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయం 1969లో, 1973లో ఆంధ్ర విశ్వవిద్యాలయం వ్యవహారిక భాషలో సిద్ధాంత గ్రంథాలు రాసేందుకు అనుమతిస్తూ తీర్మానాలు చేశాయి.

గిడుగు వారి కృషి ఫలితంగా నేటి పాఠ్య గ్రంథాల్లో, ప్రసార మాధ్యమాల్లో, పత్రికల్లో సజీవ భాష సాక్షాత్కరిస్తుంది. ఆయన ఉద్యమ ఫలితంగా తెలుగు రాష్ట్రాల్లో అక్షరాస్యతా శాతం పెరిగింది. పాఠ్య గ్రంథాలు గ్రాంథిక భాషలో ఉన్నప్పుడు అట్టడుగు బలహీనవర్గాల ప్రజలు చదువుకునేందుకు భయంతో వెనకడుగు వేసేవాళ్లు. శిష్ట వ్యవహారిక భాషలో పాఠ్య గ్రంథాలు రావడంతో అన్నివర్గాల వాళ్లు ఆసక్తితో చదువుకునేందుకు రావడం వల్ల అక్షరాస్యతా శాతం పెరిగింది. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగులో ప్రవేశించిన నవల, కథానిక, నాటకం, వ్యాసం, విమర్శ, జీవిత చరిత్ర, స్వీయ చరిత్ర వంటి వచన సాహిత్య ప్రక్రియలు వ్యావహారిక భాష వల్ల కోకొల్లలుగా వచ్చాయి. రచయితల సంఖ్య అసంఖ్యాకంగా పెరిగింది. గిడుగు వారి ప్రభావంతో వ్యవహారిక భాషలో వ్యాకరణ గ్రంథాలు వచ్చాయి. మల్లాది సూర్యనారాయణశాస్త్రి 'ఆంధ్ర భాషానుశాసనం' (1924) అనే వ్యాకరణ గ్రంథాన్ని రచించారు. గిడుగువారి వల్ల ప్రభావితుడైన తొలి వ్యాకరణ పండితుడు మల్లాదివారు. వడ్లమూడి గోపాలకృష్ణయ్య రాసిన వ్యవహారిక భాషా వ్యాకరణం (1958), వజ్ఝల వేంకటేశ్వర్లు రాసిన 'ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం' ప్రసిద్ధి చెందాయి.

తెలుగులో ప్రామాణిక నిఘంటువు బహుజనపల్లి సీతారామా చార్యులు వారి 'శబ్ద రత్నాకరం' పై గిడుగువారు నిశిత విమర్శ చేశారు. ఆ నిఘంటువును పునర్నిర్మిం చాల్సిన ఆవశ్యకతపై 1936లో ప్రతిభ పత్రికలో 30 పేజీల విమర్శ వ్యాసాన్ని రాశారు. సభాముఖంగా ఎన్నో సభల్లో ఈ విషయాన్ని చాటిచెప్పారు. 1936లో వచ్చిన సూర్యరాయాంధ్ర నిఘంటువులో గిడుగువారి సూచనలు పాటించారు. ఆయన ప్రామాణిక విమర్శలు ఆయనను ఉత్తమ పరిశోధకుడిగా నిలబెట్టాయి. వ్యవహారిక భాషా ఉద్యమంలో భాగంగా 1919లో ఆయన సంపాదకత్వంలో 'తెలుగు పత్రిక' వెలు వడింది. అందులో ఆయన సేకరించిన కొత్త విషయాలను ప్రామాణిక వ్యాసాలుగా ప్రకటించి, పండితుల ఆమోదం పొందారు.

ప్రభుత్వం పర్లాకిమిడిని ఒరిస్సా రాష్ట్రంలో చేర్చాలని నిర్ణయించింది. గిడుగువారు రాజావారి నిర్ణయానికి వ్యతిరేకంగా ఆంధ్రాలో ఉండాలని పట్టుబట్టారు. రాజావారు గిడుగువారిని ఎన్నో ఇబ్బందులు పెట్టారు. 1936 ఏప్రిల్ మొదటి తేదీన ఒరిస్సాలో కలిపేందుకు నిర్ణయించింది. ఆయనకు పర్లాకిమిడిలో ఉండేందుకు మనస్కరించక తక్షణమే రాజమండ్రిలో ఉన్న ఆయన నాలుగో కుమారుడు సూర్యనారాయణ దగ్గరకు వెళ్లిపోయారు. ఆత్మాభిమానం ఆయన వ్యక్తిత్వానికి ఆభరణం. గిడుగువారి సప్తతి మహోత్సవాలు 1933 డిసెంబరు 22, 23, 24 తేదీల్లో రాయప్రోలు సుబ్బారావు అధ్యక్షతన జరిగాయి. ఆ సందర్భంగా ఆయన వ్యాసాలను 'వ్యాసావళి' పేరుతో ప్రచురించి ఆవిష్కరించారు. ఆ సభల్లో గిడుగువారిని 'మహోపాధ్యాయ' బిరుదుతో సత్కరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు 1938లో 'కళాప్రపూర్ణ' బిరుదుతో సత్కరించారు. ఆ సందర్భంగా మద్రాసు ఆకాశవాణి నుండి వ్యవహారిక భాషా ప్రాశస్త్యాన్ని గూర్చి 15 నిమిషాలు ప్రసంగించారు. 1939 నుండి ఆయన ఆరోగ్యం క్షీణించింది. చివరిరోజుల్లో మద్రాసులో పెద్దకొడుకు సీతాపతి ఇంట్లోనే ఉన్నారు. 1940 జనవరి 22వ తేదీన ఆయన మరణించారు.

తెలుగు సవర భాషలకు ఆయన చేసిన కృషి అపారమైంది. ఉత్తమ విమర్శకుడిగా, పరిశోధకుడిగా, గ్రంథ పరిష్కర్తగా, శాసన పరి శోధకుడిగా బహు ముఖాలుగా సేవలందించిన గిడుగువారు ధన్యజీవి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయన జయంతిని మాతృభాషా దినోత్సవంగా పరిగణించడం ప్రశంసనీయం. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆయన జయంతి సందర్భంగా తెలుగు భాషకు సేవలు చేస్తున్న రచయితలను మాతృభాషా దినోత్సవ పురస్కారాలతో సత్కరించటం ముదావహం. యునెస్కో వారు మధురమైన మాతృభాష మృతభాషల అంచున ఉన్నదన్న హెచ్చరిక చేయడం బాధాకరం. కార్పొరేట్ కాలేజీల్లో నిర్బంధ సంస్కృత భాషా బోధనల స్థానంలో ప్రభుత్వం తెలుగును ప్రవేశపెట్టాలి. ఓరియంటల్ యస్‌యస్‌సి విద్యార్థులకు, దేవనాగరలిపిలో సంస్కృతం రాయగలవారికే ఇంటర్మీడియట్‌లో సంస్కృతాన్ని ఇవ్వాలి. ఇతర విద్యార్థులు తెలుగు చదివే విధంగా చేయాలి. తెలుగుమాధ్యమంలో డిగ్రీ చదివిన వారికి గతంలో ప్రకటించిన విధంగా ఉద్యోగాలలో 5శాతం బోనస్‌మార్కులు కలపాలి. దేశ విదేశీ ప్రముఖుల ప్రశంసలందుకున్న మధురమైన మన మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిపౌరుడిపై ఉంది. ప్రభుత్వం పాలనా భాషగా, బోధనా భాషగా తెలుగు భాషను బలోపేతం చేసిననాడే గిడుగు వారికి మనం సమర్పించే నిజమైన నివాళి.

కత్తులపైకి కలం దూసిన పాలస్తీనా కవి రిఫాత్ అల్ అరీర్

"అంతగా నా మరణం అనివార్యమే అయ్యే పక్షంలో/ నా కథ ఓ చిటికెడు ఆశనీ, రవ్వంత నమ్మకాన్నీ కలగని" య్యమని నిబ్బరంగా చెప్పగలిగిన కవి రిఫాత్ అల్ అరీర్. గాజా నగరంపై ఈజిప్ట్ తన "హక్కులకు" తిలోదకాలిచ్చిన పర్యవసానంగా- ఇజ్రాయిల్ ఆ నగరాన్ని ఆక్రమించిన అర్నెల్ల తర్వాత- 1979 సెప్టెంబరు 23న రిఫాత్ ఆక్రమిత గాజా నగరంలో జన్మించారు. 2023 డిసెంబర్ ఆరోతేదీన గాజా నగరంపై జరిగిన ఓ "సర్జికల్ స్ట్రైక్" లో ఈ నలభై నాలుగేళ్ల పాలస్తీనా కవి- బోధకుడు- క్రియాశీలక కార్యకర్త కన్నుమూశారు. ఇంగ్లిష్ సాహిత్యంలో డాక్టరేట్ పొందిన రిఫాత్ తన కార్యకలాపాలను సాహిత్యానికే పరిమితం చేసుకోలేదు- "వియ్ ఆర్ నాట్ నంబర్స్" అనే సాహిత్య ఉద్యమ సంస్థ వ్యవస్థాపకుల్లో ఆయనా ఒకరు! కథా రచనను, పాలస్తీనా ప్రతిఘటనకు మరో రూపంగా తీర్చిదిద్దే క్రమంలో, "వియ్ ఆర్ నాట్ నంబర్స్" గొడుగు కిందికి అనేకమంది ప్రముఖ రచయితల్నీ, మరెందరో యువ రచయితల్నీ సమీకరించడంలో రిఫాత్ చురుకైన పాత్ర పోషించారు. దానివల్లనే రిఫాత్ ఇజ్రాయిలీ జియోనిస్టుల కంటికి ఆవకాయగా మారారు! 2023 డిసెంబర్ ఆరోతేదీన జరిగిన "సర్జికల్ స్ట్రైక్" లో, రిఫాత్ నివసించే ఫ్లాట్ మాత్రమే ధ్వంసం కావడాన్ని బట్టి జియోనిస్టుల లక్ష్యమేమిటో స్పష్టం అవుతోంది. ఈ దాడిలో రిఫాత్- అతని తమ్ముడు- చెల్లెలు ఆమె పిల్లలు నలుగురు హతమయ్యారు.

నా మరణం అంతగా అనివార్యమే అయితే...

నేను కనుమూయక తప్పనట్లయితే
అంతగా నా మరణం అనివార్యమే అయ్యే పక్షంలో,
నా కథ వినిపించేందుకు నువు మెలకువగా ఉండక తప్పదు మరి!

నేను వదిలి వెళ్లిన వాటిని అమ్మి, మూరెడు గుడ్డ- దారపు బంతి కొని,
పొడవాటి తోకలతో, ఓ తెల్లని గాలిపటం తయారుచేసే నిమిత్తం
నువు మెలకువగా ఉండక తప్పదు మరి!

తన కండలో కండకీ,/తన ఆత్మలో అంతరాత్మకీ/
ఆ మాటకొస్తే అసలు ఏ ఒక్కరికీ వీడ్కోలు చెప్పకుండానే
మంటల్లో మాయమైపోయిన తన తండ్రి రాక కోసం
ఈ గాజా నగరంలో, ఏ మారుమూలో ఎదురు చూసే ఓ బిడ్డ
మునిగాళ్లపై లేచి నిలబడి, నింగిలోకి నిక్కినిక్కి చూసేటప్పుడు,
ఎగిరే నా గాలిపటాన్ని చూస్తాడు!

మమకారాన్ని తిరిగి తెచ్చిచ్చే ఏ దేవదూతగానో దాన్ని
క్షణకాలమైనా తలపోస్తాడు!!
అంచేత, అంతగా నా మరణం అనివార్యమే అయ్యే పక్షంలో,
నా కథ ఓ చిటికెడు ఆశనీ, రవ్వంత నమ్మకాన్నీ కలిగించనియ్యి!!!

మూలం: రిఫాత్ అల్ అరీర్, తెలుగు: మందలపర్తి కిషోర్

రాజాంలో కేంద్రసాహిత్య అకాడమీ సాహిత్య సదస్సు

ఈ జనవరి నెల 28 ఆదివారం ఉదయం 10.00 గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో గల విద్యానికేతన్ పాఠశాలలో కేంద్ర సాహిత్య అకాడమీ, రాజాం రచయితల వేదిక సంయుక్త నిర్వహణలో సాహిత్య సదస్సు జరుగుతుంది. ఆ ఒక్కరోజు జరిగే అబ్బూరి వరద రాజేశ్వరరావు శతజయంత్యుత్సవ సదస్సులో సాహిత్య అకాడమీ తెలుగు సలహాసంఘం కన్వీనర్ సి. మృణాళిని, గార రంగనాథం, చింతకింది శ్రీనివాసరావు, అవధానుల మణిబాబు, డి.వి.జి. శంకరరావు, బాలసుధాకర మౌళి, ఎం. కృష్ణకుమారి, సమ్మెట నాగ మల్లేశ్వరరావు, పిళ్లా తిరుపతిరావు, పాదిలాపు శ్రీనివాస్, అల్తి మోహనరావు, ఒమ్మిరమణమూర్తి తదితరులు పాల్గొంటారు.

గార రంగనాథం, 98857 58123

ఏడు భాషల ముక్కాలు -2

గ్రంథ సమీక్ష

తెలుగు సాహితీరంగంలో డాక్టర్ జీవి పూర్ణచంద్ పేరు తెలియని వారు ఉండరు. కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా, ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా ప్రపంచ రచయితల మహాసభలు నిర్వహించడంలో పూర్ణచంద్ చేసిన కృషి అందరికీ విదితమే. ఆయుర్వేద వైద్యునిగా, వంటలు, ఆయుర్వేద రచనలు రచించిన రచయితగా, కవిగా, రచయితగా వ్యాసకర్తగా బహు గ్రంథాలు ఆవిష్కరించుకున్నారు. గతంలో 'ముక్కాలు' అనే ప్రక్రియ సృష్టించారు. ఇటీవల 'ముక్కాలు-2' పేరుతో రెండవ సంపుటం కూడా తీసుకొచ్చారు. ఇటీవల కాలంలో తెలుగు సాహిత్యంలో లఘు కవిత రూప ప్రక్రియలు ఎక్కువగా వస్తున్నాయి. అందులో ఈ ముక్కాలు తన ప్రత్యేకత చాటుకుంటుంది. అయితే అది ప్రక్రియగా కొనసాగాలంటే ఒకరి నుంచి మరికొందరు కవులు దీన్ని అనుసరించి ఈ ప్రక్రియ కవిత్వాన్ని రాయడం చేపట్టాలి. గతంలో వెలువరించిన 'ముక్కాలు' సంపుటి తెలుగు ఇంగ్లీషు హిందీ భాషల్లో అనువాదం అయితే, ఇప్పుడు వెలువరించిన ముక్కాలు రెండో భాగాన్ని తెలుగులోని మూల రచనతో పాటు ఇంగ్లీషు, సంస్కృతం, హిందీ, తమిళం, కన్నడం, మలయాళం భాషల్లో వివిధ అనువాదకులచే అనువదించబడి ఏక పుస్తకంగా వెలువరించడం ఒక విశేషం. బహుశా ఒకే పుస్తకంలో మూల సారం ఏడు భాషల్లో ఒకే పుస్తకంలో కలగలిపి రావడం ఇదే ప్రథమమేమో.

'ముక్కాలు' అంటే మూడు పాదాలు. పాదాల నియమమే గాని అక్షర నియమం ఏమీ లేదు. సాధారణంగా మాటల్లో ఏదైనా చెప్పాలనుకునేప్పుడు ఎక్కువ మాటలతో సతాయిస్తుంటే.. విషయాన్ని 'సూటిగా మూడు ముక్కల్లో చెప్పరా' అంటుంటాం... అలాంటి మూడు ముక్కల్లో చెప్పే కవిత్వమే ఈ ముక్కాలు. ఒక పేజీలోనే మూల రచనలతో పాటు మిగతా ఆరు భాషల్లోనే కవిత్వం కూడా అన్ని భాషల్లోనే మూడు పాదాల్లో ఉండడం విశేషం. ఇటీవల వచ్చే లఘు కవితల్లో మినీ కవితకు తప్పించి మిగతా ప్రక్రియలకు శీర్షిక ఉండదు. కానీ ఈ ముక్కాలుకి శీర్షిక ప్రధానం. ఉదాహరణకి- "మబ్బుల పందిళ్ళకి డబ్బుల చాందినీలు/ ఊహల స్తంభాలకు కొబ్బరాకు నోట్లు/కాకమ్మ పెళ్లికి ఊరంతా సందడి' . దీనికి శీర్షిక 'దర్పం'. దర్పం యొక్క ఆర్భాటం ఎలా ఉంటుందో మనకి ఈ కవితలోని శీర్షికను బట్టి తేలిగ్గా అర్థం అయిపోతుంది. తేలికగా అర్థం అవడం అనేది లఘు కవితా రూపాల ప్రత్యేకత.

మరో ఆలోచనాత్మక... చమత్కారవంతమైన ముక్కాలు చూద్దాం- "పుట్టాడని తెచ్చి మంచం మీదకి../చనిపోతాడని మంచం మీంచి నేల మీదకి.../మంచం మీద ఉన్నంత సేపే జీవితం.." దీని శీర్షిక 'శోభనం'. అద్భుతమైన వాస్తవమిది. ఇటువంటి ఆలోచనాత్మకమైన ముక్కాలు ఏడు భాషా పాఠకులు ఒకే పుస్తకం ద్వారా చదవవచ్చు.

తెలుగు సాహిత్యరంగంలో ప్రయోగాలకు కొదవేం లేదు. కానీ ఒకేసారి ఏడు భాషల్లో ఒక పుస్తకం అనగానే ఒక ప్రత్యేక రికార్డే. ఈ విధంగా తెలుగు సాహిత్య గొప్పతనం మరో ఆరు భాషల్లోకి వెళ్లడం అంటే, అది మన భాషా రచన యొక్క గొప్పతనాన్ని ప్రపంచానికి చాటినట్లేనని భావించాలి. మన తెలుగు సాహిత్యం యొక్క గొప్పతనం ఇకముందు కూడా ఈ విధంగానే అన్ని భాషల్లోకి తర్జుమా కావాలి. మన రచయితల గొప్పతనాన్ని విశ్వవ్యాప్తంగా చాటాలి.

\- చలపాక ప్రకాష్



ముక్కాలు-2 - మూల రచయిత: డాక్టర్ జి.వి.పూర్ణచందు
పుటలు: 104, వెల:100/-
ప్రచురణ: శ్రీమతి గుత్తికొండ రామరత్నం చారిటబుల్ ట్రస్ట్,
ప్రతులకు: డాక్టర్ జి వి పూర్ణచందు,
సుశ్రుత ఆయుర్వేదిక్ హాస్పిటల్, సత్యం టవర్స్, బకింగ్ హాంపేట్ పోస్ట్ ఆఫీస్ ఎదురు, గవర్నర్ పేట, విజయవాడ-520002

సాహిత్య, సంగీత కళానిధి రాళ్లపల్లి

"రాళ్లలో ఒక నవ్వ రాగ ముదయిస్తే
పల్లిలో ఒక భవ్య భావ ముదయిస్తే
రాగభావములు రసయోగ్యాకృతి వహిస్తే
ఆ మూర్తి రాళ్ళపల్లి అనంత కృష్ణునిది
ఆ స్ఫూర్తి అక్షర శిఖరాగ్ర రోచిష్ణునిది/మతము వైష్ణవము అభిమతము శివము" అనిసుప్రసిద్ధ కవి, సినీ గేయ రచయిత డా. సి. నారాయణరెడ్డి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మను ప్రశంసించారు.

తెలుగు సాహిత్య ప్రపంచానికి ఎంతో మంది రచయితలు అమోఘమైన సేవలు చేశారు. అలాంటి ప్రతిభావంతుల్లో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ పేర్కొనదగినవారు. ఈయన కవి, అనువాదకులు, విమర్శకులు, విద్వాంసులు, సంగీత శాస్త్ర ప్రవీణులుగా ప్రఖ్యాతులు. ప్రసిద్ధ ఆంగ్ల రచయిత డా. శామ్యూల్ జాన్సన్ మరో మహా రచయిత ఆలివర్ గోల్డ్ స్మిత్ గురించి "ఆయన పట్టిందల్లా బంగారం చేసిన మహా ప్రతిభావంతుడు" అన్న మాటలు శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మకు కూడా వర్తిస్తాయి. ఆయన తెలుగు వచనానికి ఒరవడి దిద్దిన శిల్పి.సాహిత్య, సంగీత రంగాల్లో పదిల పరచుకున్న స్థానం అద్వితీయమైంది.

రాళ్ళపల్లివారి సృజనాత్మక రచనల్లో 'భార్గవీ పంచవిశతీ',(ఇది ఇరవై ఎనిమిది పద్యాల రచన)'తారాదేవి' (1911), మిరాబాయి (1913) ఈ రెండు ఖండకావ్యాలూ సమకాలీన రచనలకు భిన్నమైనవి. 'పెనుగొండ కొండ', పరిహాస లీల', 'ముసలి వీణ', 'సంధ్యావందనము', 'విస్మృత వేణుగీతి', 'శమీపూజ' , 'భారతికి సాధువాదము', 'ప్రబంధకవి' మొదలైన ముక్తక కవితల్లో భవ్యమైన కల్పనలు కనబడతాయి. ప్రాంతీయ అస్తిత్వ కోణాలు దర్శనమిస్తాయి. తెలుగు నుడికారానికి ఆటపట్టులుగా అగుపిస్తాయి.

శర్మ అనువాదాల్లో మొదటిది 'సుభాషితకౌస్తుభం'. ఇది అలభ్యం. లభ్యమౌతున్న శర్మ అనువాద రచనలు ఐదు అవి అజవిలాపము (1918), వేదాంత దేశికుని అభీతి స్తవము (1961), శాలివాహన గాథా సప్తశతీసారము (1964), నృత్తరత్నావళి (1969), సుందర పాండ్య విరచిత ఆర్యా (1970) ఇవన్నీ మూల రచనల వైశిష్ట్యాన్ని తెలుపుతూ సహజ సుందర శైలిలో రచించారు. వేటికవే ఒక ప్రత్యేకతను చాటుతున్నాయి.



'వేమన' (1929), 'నాటకోపన్యాసములు' (1935) 'సారస్వతాలోకము' (1954), 'రాళ్ళపల్లి పీఠికలు' (1979)ఇటీవల 2017లో ఎమెస్కో బుక్స్ పబ్లికేషన్స్ ప్రచురించిన 'రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు'మొదలైనవి వీరి విమర్శ రచనలు. వీటిని సునిశితంగా అధ్యయనం చేస్తే అమూల్యమైన సాహిత్య విలువలు, సిద్ధాంతాలు దర్శనమిస్తాయి. కాగా తెలుగు సాహిత్య విమర్శకు ఒక దిశా నిర్దేశాన్ని కలిగిస్తాయి. కట్టమంచి రామలింగారెడ్డి భావనా శక్తిని రూపొందించగా శర్మ దీనికి వస్తువు, రచన అనే సిద్ధాంతాలను కల్పించి నిర్దిష్టమైన మార్గాన్ని ఏర్పరచారు. సాహిత్య పరిశీలనకు ఈ భావము, వస్తువు, రచనలు బాగా ఉపకరిస్తాయి.

సంగీత రచనల సృష్టిలో శర్మ విలక్షణత గొప్పది. కానీ ఇది కొద్ది మందికి మాత్రమే తెలుసు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన రాళ్ళపల్లి వారు సాహిత్య వ్యాసం రాయడంలోనూ, ఒక అభిప్రాయం చెప్పడంలోనూ ప్రత్యేకత పొందినట్లే, ఒక కీర్తనను పరిష్కరించడంలోనూ అంతే ప్రతిపత్తిని చాటుకున్నారు. దీనికి అన్నమయ్య సంకీర్తనలు, మీరాబాయి పాటల పరిష్కరణే నిదర్శనం. వీరి సంగీత రచనలైన గీతాలు, స్వర పల్లవులు, వర్ణాలు, కృతులు, తిల్లానాలు, మంగళాలని ప్రధానంగా ఉన్నాయి. వీటన్నిటినీ జాగ్రత్తగా అధ్యయనం చేస్తే శర్మ పాండిత్యం బోధపడుతుంది. సంగీత త్రిమూర్తులచే మహెూత్కృష్టంగా తీర్చిదిద్దిన కృతి యొక్క ఆకృతి వీరి రచనలలో కూడా ఆవిష్కరించారు. ఇవన్నీ రాళ్ళపల్లి ఫణిశాయి సంపాదకత్వంలో 'పరమానంద గానసుధా' (2002) గ్రంథం ద్వారా వెలుగుచూశాయి. ఇది కన్నడ భాషలో రాసినది.

సంగీత విద్యపై ఈయన రాసిన వ్యాసాలు విలువైనవి. ఇవి శ్రీ సాధన, భారతి, నాట్య కళ, ఆంధ్రపత్రిక ఉగాది సంచిక మొదలైన పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఇవన్నీ సాహిత్య, సంగీత అభిమానులకు బాగా ఉపకరిస్తాయి.

శర్మకి తండ్రి సాహిత్య గురువైతే, తల్లి సంగీత గురువులని చెప్పవచ్చు. తర్వాత తర్వాత సాహిత్యంలో శ్రీ కృష్ణ బ్రహ్మ తంత్ర పరకాల యతీశ్వరులు, కట్టమంచి రామలింగారెడ్డి మొదలైన ప్రభృతులతో శిష్యరికం వీరికి ఎంతో విద్వత్తును చేకూర్చింది. సంగీతంలో గాన విశారద బిడారం కృష్ణప్ప, వీణ శేషణ్ణ. వీణ సుబ్బణ్ణ, మైసూరు వాసుదేవా చార్య లాంటి సంగీత విద్వాంసుల సాన్నిహిత్యం వలన రాళ్ళపల్లి వారు గొప్ప సంస్కారాన్ని అలవరచుకున్నారు. అంతేకాదు హిందూస్తానీ, కర్ణాటక సంగీత తత్త్వాల సారాన్ని గ్రహించారు. సంగీత వాయిద్యాల మర్మాన్ని అర్థం చేసుకున్నారు. రాగ, తాళాల మేళవింపులని శ్రద్ధగా ఆకళింపు చేసుకోగలిగారు.శర్మ తెలుగు వారి సంగీత వైశిష్ట్యాన్ని తమ వ్యాసాల్లో చక్కగా ఆవిష్కరింపజేశారు. ప్రధానంగా వాగ్గేయకారుల కృషి విశేషాలనూ, వారి ఔన్నత్యాన్ని ఇనుమడింపజేశారు. సంగీతంలో ఇంతటి పాండిత్యాన్ని సంపాదించిన రాళ్ళపల్లి వారిని సంగీత ఉద్దండులు ఆధునిక వాగ్గేయకారుడని అభివర్ణించారు.

రాళ్ళపల్లి వారు సాహిత్య, సంగీత పాఠాలను ఎంతో సాధన చేసి, సిద్ధిని పొందారు. వీరి సాధన సిద్ధులు సమకాలీన సమాజానికి గొప్ప ఆదర్శనీయం. అనంతకృష్ణుల వారి విశేషమైన కృషికి 'గాన కళా సింధూ', 'గాన కళాప్రపూర్ణ', 'సంగీత కళా రత్నా', 'సంగీత కళానిధి' లాంటి బిరుదులతో వివిధ సంస్థలు సత్కరించాయి. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ పట్టానిచ్చి గౌరవించింది. 1979 లో బెంగళూరులో తన పెద్ద కుమారుడు ఫణిశాయి ఇంట్లో ఉన్నపుడు తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఆస్థాన పండితుడిగా ఎన్నుకున్నారు. ఇది జరిగిన ఇరవై నిమిషాలకు రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ కీర్తిశేషులైనారు.

అనంతకృష్ణశర్మ దృష్టి ఎంతో విశాలమైనది, లోతైనది కూడా. సమకాలీన సంఘంలో వివిధ రంగాల్ని నిశితంగా పరిశీలించి ఘాటుగా విమర్శించిన ఘనపాఠి.

డాక్టర్ బడిగె ఉమేశ్, ఫోన్ : 9494815854

పశ్చిమాసియాకు వలసలు జోరు

- యూపీ, బీహార్, తమిళనాడు నుంచే కార్మికులు అధికం
- తాజా నివేదిక వెల్లడి

ముంబై: దేశంలో ఉపాధి అవకాశాలు కొరవడటంతో ప్రజలు పెద్ద సంఖ్యలో ఇతర దేశాలకు వలస పోతున్నారు. ఇదే విషయాన్ని తాజా నివేదిక ఒకటి వెల్లడించింది. గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ) దేశాల్లోని నిర్మాణ పరిశ్రమలో భారతదేశానికి చెందిన అత్యధిక శ్రామిక శక్తి ఉత్తర ప్రదేశ్, బీహార్, రాజస్తాన్, తమిళనాడుకు చెందిన కార్మికులు అని ఆ నివేదిక తెలిపింది. వలస కార్మికులను వ్యాపార సంస్థలతో అనుసంధానించే యూఏఈ ఆధారిత మార్కెట్‌ప్లేస్ అయిన హంటర్ వివరాల ప్రకారం... ఉత్తర ప్రదేశ్, బీహార్, రాజస్తాన్, తమిళనాడు జీసీసీ దేశాలకు భారతదేశం నుంచి భవన నిర్మాణ కార్మికుల వలసలకు అత్యధిక సహకారం అందిస్తున్నాయి. తాపీపని, వడ్రంగి, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు, వెల్డింగ్ వంటి నైపుణ్యం ఉన్న కార్మికులు, నిర్మాణ ప్రాజెక్టులలో పూర్వ అనుభవం ఉన్నవారు జీసీసీ దేశాల్లోని పరిశ్రమలచే అత్యంత విలువైన కార్మిక శక్తిగా పరిగణించబడుతున్నారని నివేదిక పేర్కొంది. ఇంకా జీసీసీ ప్రాంతంలో పనిచేసే కార్మికులకు భారత నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ) నుంచి ధ్రువపత్రాలు, మంచి శారీరక దృఢత్వం అవసరమని నివేదిక వెల్లడించింది. ఆంగ్ల భాషలో ప్రాథమిక కమ్యూనికేషన్ నైపుణ్యాలు, విభిన్న పని పరిస్థితులు, సంస్కృతులకు అనుగుణంగా ఉన్న కార్మికులు నిర్మాణ రంగంలో విలువ కలిగి ఉంటారని తెలిపింది. హంటర్ అందించిన వివరాల విశ్లేషణ ఆధారంగా ఈ నివేదిక ఉంది. మధ్యప్రాచ్యంలో నిర్మాణ పరిశ్రమలో పని చేస్తున్న భారతదేశానికి చెందిన ఈ కార్మికులు 20 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు... ఎక్కువగా పురుషులు. నిర్మాణ రంగంలో ఈ బ్లూ కాలర్ కార్మికులలో చాలా మంది విభిన్న విద్యా నేపథ్యాలకు చెందిన వారేనని నివేదిక కనుగొంది. నిర్మాణ పనుల్లో నిమగ్నమైన వ్యక్తులు కనీస అధికారిక విద్యను కలిగి ఉంటారు. ఇది విస్తృత స్థాయిలో వ్యక్తులకు ఇటువంటి ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తీసుకువస్తుందని పేర్కొంది. అయితే, నిర్దిష్ట నిర్మాణ ట్రేడ్‌లలో సాంకేతిక లేదా వృత్తిపరమైన శిక్షణ పొందిన కార్మికులు మరింత విలువైన కార్మిక శక్తిగా పరిగణించబడుతున్నారని, ఈ రంగంలో ప్రత్యేక నైపుణ్యాల ప్రాముఖ్యతను కూడా ఇది ప్రదర్శిస్తుందని నివేదిక వివరించింది. 'ప్రపంచ కార్మిక వలసలను పరిశీలిస్తే... భారతదేశం కాకుండా నేపాల్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, ఉగాండా, కెన్యా, ఘనా, సియెర్రా లియోన్ వంటి దేశాల నుంచి కార్మికులు మధ్యప్రాచ్య ప్రాంతంలో నిర్మాణ రంగానికి గణనీయంగా సహకరిస్తున్నారు' అని హంటర్ సీఈవో శామ్యూల్ జాయ్ తెలిపారు. ఇటీవలి సంవత్సరాలలో స్థిరమైన జీతం ఉన్నప్పటికీ, ప్రస్తుత డిమాండ్ పెరుగుదల ఇంక్రిమెంట్‌లను సూచిస్తుందని, ఇది మార్కెట్ అభివృద్ధి చెందుతున్న పరిస్థితిని ప్రతిబింబిస్తుందని అన్నారు. 'నిర్మాణ కార్మికుల కోసం పశ్చిమాసియాలోని అవసరాలు సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, కువైట్, ఒమన్‌లకు విస్తరించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా నైపుణ్యం కలిగిన కార్మికుల కోసం విస్తృత అవకాశాలను సృష్టిస్తుంది' అని జాయ్ జోడించారు.

అంతరిక్షం నుంచి అయోధ్య దృశ్యం

న్యూఢిల్లీ: అయోధ్యలో రామ మందిర ప్రతిష్ఠాపన కార్యక్రమం జనవరి 22(సోమవారం)న జరగనుంది. ఈ సందర్భంగా అంతరిక్షం నుంచి తీసిన రామ మందిర దృశ్యాలను ఇస్రో విడుదల చేసింది. ఇస్రో అధ్వర్యంలోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఈ దృశ్యాలను తీసింది. డిసెంబర్ 16, 2023న నిర్మాణంలో ఉన్న ఆలయం ఫొటోలు తీసింది. ఉపగ్రహ చిత్రాలలో నూతనంగా అభివృద్ధి చేసిన దశరథ్ మహల్, సరయు నది, కొత్తగా పునరుద్ధరించిన అయోధ్య రైల్వే స్టేషన్‌ను కూడా చూడవచ్చు.

అయోధ్యలో వసతి గది ధర రూ.లక్ష !

లక్నో: అయోధ్యలో రామ మందిర నిర్మానానికి ప్రధాని మోదీ భూమి పూజ చేసిన నాటి నుంచి అయోధ్య రూపు రేఖలు మారిపోయాయి. ముఖ్యంగా పర్యాటక రంగం అనూహ్యంగా వృద్ధి సాధిస్తున్నట్లు వివిధ నివేదికలు వెలుగులోకి వచ్చాయి. ఇక బాలరాముడు దర్శనం కోసం ప్రముఖులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు అయోధ్యకు భారీ ఎత్తున తరలివస్తున్నారు. ఈ తరుణంలో అయోధ్యలోని హోటల్స్‌లో అద్దె గదుల ధరలు ఒక రాత్రికి రూ. లక్షకు పెరిగినట్లు వార్తలు షికార్లు చేస్తున్నాయి. సంబంధిత వీడియోలు సోషల్ మీడియాలో దర్శనమిస్తున్నాయి. స్థానికంగా ఉన్న పార్క్ ఇన్ రాడిసన్ హెూటల్ టాప్ రూమ్ ధర రూ.లక్ష మార్క్ దాటింది. స్థానికంగా ఉన్న హెూటల్ రామాయణ ప్రతినిధులు మాట్లాడుతూ... జనవరి 20-25 మధ్యలో హెూటల్ గదులు పూర్తిగా బుక్ అయ్యాయి. పార్క్ ఇన్ హెూటల్‌లో డిసెంబర్ మధ్య నుంచే బుకింగ్‌ల జోరందుకుంది.

అందుబాటులోకి హోమ్ స్టేలు

రామమందిరం కేవలం 6 కిలోమీటర్ల దూరంలో ఉన్నందున, రామమందిరం ప్రారంభమైన తర్వాత హోటల్ గదుల ధరలు రాత్రికి రూ.7వేల నుండి రూ. 25వేల వరకు పెరిగాయని సిగ్నెట్ కలెక్షన్ హోటల్స్ ప్రతినిధులు చెబుతున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా నగరంలో అనేక హోమ్‌స్టేలు కూడా వచ్చాయి. రూ.4 వేల నుంచి సరసమైన ధరకే గదులు అందిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

చివరి నిమిషంలో ఆహ్వానమా? శివసేన మండిపాటు

ముంబై: అయోధ్యలోని రామ మందిరం ప్రారంభానికి మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రేకు స్పీడ్ పోస్ట్ ద్వారా ఆహ్వానం అందింది. అయితే అయోధ్య ఉద్యమంతో సంబంధం ఉన్న ఉద్ధవ్ ఠాక్రేకు చివరి నిమిషంలో స్పీడ్ పోస్ట్ ద్వారా ఆహ్వానం పంపడంపై ఆయన వర్గం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఠాక్రే కుటుంబం పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై సంజయ్ రౌత్ మండిపడ్డారు. 'సినిమా తారలందరినీ ప్రత్యేకంగా ఆహ్వానిస్తారు. ఉద్యమంతో సన్నిహితంగా ఉన్న ఠాక్రే కుటుంబం పట్ల ఈ విధంగా వ్యవహరిస్తారు' అని విమర్శించారు. కాగా, ఉద్ధవ్ ఠాక్రే సోమవారం నుంచి రెండు రోజులు నాసిక్‌లో పర్యటిస్తారని సంజయ్ రౌత్ తెలిపారు. సోమవారం కాలారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడంతోపాటు గోదావరి నది ఒడ్డున మహా హారతి నిర్వహిస్తారని చెప్పారు. మంగళవారం నాసిక్‌లో జరిగే పార్టీ సమావేశంలో ఉద్ధవ్ ఠాక్రే పాల్గొంటారని వెల్లడించారు. మరోవైపు ఉద్ధవ్ ఠాక్రేకు స్పీడ్ పోస్ట్ ద్వారా ఆహ్వానం పంపడంపై సీఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు చెందిన మంత్రి ఉదయ్ సామంత్ స్పందించారు. ఆహ్వానం వేగంగా చేరేందుకు స్పీడ్ పోస్ట్ ద్వారా పంపినట్లు చెప్పారు. అది ఆయనకు అందిందని మీడియాతో అన్నారు.

దేశంలో పెరిగిన విద్యుత్ వినియోగం

- ఏప్రిల్-డిసెంబర్ మధ్య వినియోగం 1,132 బిలియన్ యూనిట్లు
- వేసవిలో 229 గిగా వాట్లకు చేరుతుందని అంచనా



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలో భారత్‌లో విద్యుత్ వినియోగం సుమారు 8 శాతం పెరిగి 1,221.15 బిలియన్ యూనిట్లకు చేరుకుంది. 2022-23లో ఏప్రిల్-డిసెంబర్ మధ్య విద్యుత్ వినియోగం 1,132.11 బిలియన్ యూనిట్ల వద్ద నిలిచినట్లు ఆదివారం విడుదలైన ఒక నివేదిక తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ వినియోగం 1,504.26 యూనిట్లతో పోలిస్తే 2021-22 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 1,374.02 బిలియన్ యూనిట్ల కంటే అధికంగా నిలిచింది. 2023 వేసవిలో దేశ విద్యుత్ వినియోగం 229 గిగా వాట్ల (జీడబ్ల్యూ)కు చేరుకుంటుందని విద్యుత్ శాఖ అంచనావేసింది. అకాల వర్షాల కారణంగా ఏప్రిల్-జులైలో డిమాండ్ అంచనా స్థాయికి చేరుకోలేదు. కానీ జూన్‌లో గరిష్ట డిమాండ్ 224.1 జీడబ్ల్యూ కొత్త గరిష్టస్థాయిని తాకింది. జులైలో 2.9.03 జిడబ్ల్యుకి పడిపోయింది. తిరిగి ఆగస్టులో గరిష్టడిమాండ్ 238.82 జిడబ్ల్యులకి చేరుకుంది. సెప్టెంబర్‌లో రికార్డుస్థాయిలో 243.27జిడబ్ల్యులకి చేరుకోగా, అక్టోబర్‌లో గరిష్ట డిమాండ్ 222.16జీడబ్ల్యూ, నవంబర్‌లో 204.77జీడబ్ల్యూ, డిసెంబర్‌లో 213.62 జీడబ్ల్యూగా ఉంది. నిపుణుల అంచనాల ప్రకారం. గతేడాది మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో వర్షాలు విస్తారంగా కురవడంతో విద్యుత్ వినియోగంపై ప్రభావం పడింది. అయితే తేమ వాతావరణ పరిస్థితుల కారణంగా ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లలో విద్యుత్ వినియోగం పెరిగిందని అన్నారు. పండుగల ప్రభావంతో పారిశ్రామిక కార్యకలాపాలు పుంజుకున్నాయని చెప్పారు. 2013-14 నుండి 2022-23 వరకు విద్యుత్ డిమాండ్ 50.8 శాతం పెరిగిందని డేటా తెలిపింది. గరిష్ట విద్యుత్ డిమాండ్ 2013-14లో 136 గిగావాట్ల నుంచి సెప్టెంబర్ 2023 నాటికి 243 గిగావాట్లకు పెరిగింది.

విజయాలను గుర్తుచేసుకునే సందర్భం

మణిపూర్, త్రిపుర, మేఘాలయ ప్రజలకు మోదీ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రాలైన మణిపూర్, త్రిపుర, మేఘాలయా ఆదివారం రాష్ట్ర అవతరణ దినోత్సవాలను నిర్వహించుకున్నాయి. ఈ సందర్భంగా అక్కడి ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఇది మూడు రాష్ట్రాల ప్రజలు సాధించిన విజయాలను గుర్తు చేసుకునే ప్రత్యేక సందర్భమని ట్వీట్ చేశారు. "రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మణిపూర్ ప్రజలకు శుభాకాంక్షలు. భారత దేశాభివృద్ధికి రాష్ట్రం బలమైన సహకారాన్ని అందించింది. ఈ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాల పట్ల గర్విస్తున్నాను. మణిపూర్ నిరంతర అభివృద్ధి చెందాలని ప్రార్థిస్తున్నా" అని మోదీ ట్వీట్ చేశారు. "మేఘాలయా ప్రజలకు శుభాకాంక్షలు. రాబోయే రోజుల్లో రాష్ట్రం సరికొత్త అభివృద్ధి శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షిస్తున్నా" అని ట్వీట్‌లో పేర్కొన్నారు. "ఈ ప్రత్యేకమైన రోజున త్రిపుర ప్రజల శ్రేయస్సు, సామరస్యాన్ని కోరుకుంటున్నా. ఘన చరిత్ర, వారసత్వాన్ని గుర్తు చేసుకునే ప్రత్యేకమైన రోజు ఇది" అని ప్రధాని తెలిపారు. జాతుల మధ్య వైరంతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో ఘర్షణలను కట్టడి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని తిరుగుబాటు గ్రూపులతో శాంతి ఒప్పందాన్ని చేసుకున్నాయి. కానీ, మైన్మార్ సరిహద్దుల్లోని ప్రాంతాల్లో మాత్రం భద్రతా బలగాలు, పౌరులు లక్ష్యంగా దాడులు జరుగుతూనే ఉన్నాయి. మరోవైపు మణిపూర్ అంశంపై ప్రధాని మోదీ స్పందించకపోవడాన్ని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఆయన మణిపూర్‌లో పర్యటించాలని డిమాండ్ చేస్తున్నాయి.

ఇద్దరు బాలికలపై ప్రధానోపాధ్యాయుడి లైంగిక దాడి

భువనేశ్వర్: పాఠశాలలో చదువుతున్న ఇద్దరు బాలికలపై ప్రధానోపాధ్యాయుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన తర్వాత బాలికలు పాఠశాలకు వెళ్లేందుకు నిరాకరించారు. తల్లిదండ్రులు నిలదీయగా జరిగిన దారుణం గురించి చెప్పారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఆ ప్రధానోపాధ్యాయుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఒడిశాలోని కేంద్రపారా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఈ నెల 16న ప్రైవేట్ స్కూల్‌కు చెందిన ప్రధానోపాధ్యాయుడు ఆరు, ఏడు తరగతులు చదువుతున్న ఇద్దరు బాలికలపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆ మరునాడు బడికి వెళ్లేందుకు బాధిత బాలికలు నిరాకరించారు. ఏం జరిగిందని తల్లిదండ్రులు ఒత్తిడి చేయగా ఈ విషయం చెప్పారు. దీంతో బాలికల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేపటి నుంచే ఆలయం నిర్మాణ పనులు

కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా వెల్లడి

న్యూఢిల్లీ: అయోధ్యలో రామాలయ నిర్మాణ పనులు మంగళవారం నుంచే తిరిగి చేపడతామని రామమందిర నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. ఆదివారం ఆయన అయోధ్యలో విలేకరులతో మాట్లాడుతూ, 'జనవరి 23 నుంచే మళ్లీ నిర్మాణ పనులను మొదలు పెడతాం. 2024 ముగిసేసరికి నూతన ఉత్సాహంతో అలయ నిర్మాణం పూర్తిచేస్తాం. ఆలయ ప్రాంగణంలో మరో ఏడు ఉపాలయాలు నిర్మించాల్సి ఉంది. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం తర్వాత వీటిని చేపడతాం' అని తెలిపారు. సోమవారం నాటి కార్యక్రమం ఏర్పాట్లు వివరిస్తూ, యావత్ దేశానికి ఇచ్చిన హామీని నెరవేర్చేలా ఇవి ఉంటాయన్నారు. జనవరి 16న ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం మధ్యాహ్నం 12.30కు మొదలై ఒంటి గంటకు పూర్తవుతుంది. అనంతరం ప్రధాని మోదీ ప్రసంగిస్తారు. జనవరి 23 నుంచి సాధారణ భక్తుల దర్శనాలకు అనుమతించనున్నారు. నగర శైలిలో నిర్మిస్తున్న ఈ రామమందిరం 2.7ఎకరాల్లో విస్తరించి ఉంది. 380 అడుగుల పొడవు, 250 అడుగుల వెడల్పు, 161 అడుగుల ఎత్తులో దీన్ని నిర్మిస్తున్నారు. మొత్తంగా 392 స్తంభాలు, 44 ద్వారాలు ఉంటాయి. ఆలయ నిర్మాణానికి ఇప్పటికే దాదాపు రూ.1100 కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. మొత్తం పూర్తవడానికి మరో రూ.300 నుంచి రూ.400 కోట్లు అవసరమవుతుందని అంచనా అని నృపేంద్ర మిశ్రా తెలిపారు.

రామ మందిర నిర్మాణ ఖర్చు రూ.1,100 కోట్లపైనే

ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరి వెల్లడి



అయోధ్య: అయోధ్యలో 161 అడుగుల ఎత్తుతో మూడు అంతస్తులుగా (జీ ప్లస్ 2) చేపడుతున్న రామమందిర నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.1,100 కోట్లకుపైగా ఖర్చయినట్లు శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరి తెలిపారు. మొత్తం పనులు పూర్తి చేసేందుకు మరో రూ.300 కోట్లు అవసరమవుతాయని చెప్పారు. తాత్కాలిక మందిరంలోని పాత రామ్‌లల్లా మూర్తిని కొత్త విగ్రహం ముందు ఉంచుతామని చెప్పారు. 51 అంగుళాల బాల రాముడి విగ్రహాన్ని గురువారం ఆలయ గర్భగుడిలోకి చేర్చిన విషయం తెలిసిందే. మొత్తం మూడింటిలో మైసూరుకు చెందిన శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కిన ప్రతిమను ఎంపిక చేశారు. మిగతా రెండింటినీ ఆలయంలో ఉంచుతామని గోవింద్ దేవ్ గిరి తెలిపారు. వాటిలో ఒకదాన్ని రాముడి వస్త్రాలు, ఆభరణాలకు సంబంధించి కొలతలు తీసుకునేందుకు ఉపయోగిస్తామన్నారు. "పాత విగ్రహం ఐదారు అంగుళాల ఎత్తు ఉంది. 25- 30 అడుగుల దూరం నుంచి ఇది స్పష్టంగా కనిపించదు. అందుకే పెద్ద మూర్తి అవసరమైంది" అని దేవ్‌గిరి చెప్పారు.

"మూడింటిలో ఒకదాన్ని ఎంచుకోవడం చాలా కష్టమైంది. అవన్నీ అందంగా ఉన్నాయి. దివ్యమైన మెరుపుతో కూడిన పిల్లవాడి ముఖం, రాముడు ఆజానుబాహుడు కాబట్టి చేతులు పొడవుగా ఉండటం వంటి ప్రమాణాలను పాటించాయి. మేం ఎంపిక చేసిన ప్రతిమ శరీర పుష్టి, మంచి వ్యక్తిత్వం కనబడేలా చక్కగా కుదిరింది. పిల్లవాడి సున్నిత స్వభావం దాని అందాన్ని పెంచింది. ఆభరణాలను సున్నితంగా చెక్కారు" అని ట్రస్టు కోశాధికారి వివరించారు. విగ్రహాలను చెక్కేందుకు నాలుగైదు నెలలు పట్టిందని, అనంతరం ఒకరోజు వాటిని పరిశీలించి తుది నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

అయోధ్యలో భారీ భద్రత

13వేల మంది భద్రతా బలగాలు, బాంబు నిర్వీర్య బృందాలు

అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో సోమవారం రామమందిర ప్రారంభ కార్యక్రమం జరగనున్న క్రమంలో పెద్ద ఎత్తున భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు, బాంబు నిర్వీర్య బృందాలు, జాగిలాలతో కూడి నిఘా బృందాలు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది సహా దాదాపు 13వేల మంది భద్రతా బలగాలను అయోధ్యలో మోహరించారు. ఉత్తరప్రదేశ్ డీజీ (లా అండ్ ఆర్డర్) ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ... భద్రతా బలగాలతో పాటు అయోధ్యలో భద్రతా వ్యవస్థను మెరుగుపరచడానికి పోలీసులు కృత్రిమ మేధస్సుతో నడిచే సీసీ టీవీలను ఉపయోగిస్తున్నారని తెలిపారు. ముందు 24×7 భద్రతా పర్యవేక్షణ కోసం అయోధ్య అంతటా 10,000 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అవి యాంటీ డ్రోన్ టెక్నాలజీ కూడా వినియోగిస్తున్నారు. లతా మంగేష్కర్ చౌక్ వద్ద ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) సిబ్బందిని మోహరించారు. సరయు నదిపై పోలీసులు తరచూ బోట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. రామమందిరం ప్రారంభానికి ప్రముఖులు వస్తుండటంతో అయోధ్యలో కొత్తగా ప్రారంభించిన మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయంలో యాంటీ బాంబ్, డాగ్ స్క్వాడ్‌లను మోహరించారు. పోలీసులు అయోధ్యలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అనుమతి ఉన్న వాహనాలను మాత్రమే నగరంలోకి అనుమతిస్తున్నారు. అయోధ్యలోని ప్రతి కూడలిలో ముళ్ల తీగతో కదిలే బారికేడ్లను సిద్ధంగా ఉంచారు. ముఖ్యంగా అత్యంత ప్రముఖల కదలికల సమయంలో ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పోలీసులు వీటిని ఉపయోగిస్తారు.

ఢిల్లీలోనూ భద్రత కట్టుదిట్టం

అయోధ్యలో రామ మందిర ప్రారంభ వేడుకల సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలోని ప్రముఖ దేవాలయాలు, వివిధ మార్కెట్లలో భద్రతను కట్టుదిట్టం చేయడంతోపాటు సీసీటీవీ కెమెరాలతో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసినట్లు ఢిల్లీ పోలీసు అధికారులు తెలిపారు. ఆలయాలు, మార్కెట్ల వద్ద బహుళస్థాయి భద్రతా తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. హోటళ్లు, గెస్ట్ హౌస్‌లు, ధర్మశాలలను తనిఖీ చేయాలని పెట్రోలింగ్ సిబ్బందిని ఆదేశించినట్లు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఈశాన్య) జాయ్ టిర్కీ తెలిపారు.

ప్రఖ్యాత షూటర్‌లకు తాజా లైసెన్స్‌లు

'అఖిల భారత' చెల్లుబాటుకు ఢిల్లీ ఎల్‌జీ ఆదేశాలు

న్యూఢిల్లీ : ప్రఖ్యాత షూటర్లకు ఢిల్లీ పరిధికి బదులుగా 'ఆల్ ఇండియా' చెల్లుబాటు కోసం తాజా లైసెన్స్‌లు జారీ చేయాలని ఢిల్లీ పోలీసులను లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా ఆదేశించారని రాజ్ నివాస్ అధికారులు ఆదివారం తెలిపారు. వివిధ క్రీడా కార్యక్రమాల కోసం వారు తరచూ దేశమంతటా పర్యటించాల్సి ఉంటుందనే వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని ఆదేశించారన్నారు. వారి కాట్రిడ్జ్ కోటా కూడా ఏటా 20 నుంచి 10 వేల వరకు గణనీయంగా పెరిగిందని అధికారులు తెలిపారు, వన్-టైమ్ కాట్రిడ్జ్ సేకరణను ప్రస్తుతం 10 నుంచి 1,000 కు పెంచారు. 'లైసెన్సింగ్ ప్రక్రియలను హేతుబద్ధీకరించడానికి, సులభతరం చేయడానికి ఎల్‌జీ చేసిన నిర్ణయాత్మక ఒత్తిడిని అనుసరించి, ఢిల్లీ పోలీసులు ఆయుధాల లైసెన్సుల మంజూరులో ఒక పెద్ద సంస్కరణను ప్రారంభించారు. ఇప్పటి వరకు అభిమానం, అవినీతి, ఏకపక్ష ఫిర్యాదులతో దెబ్బతింది. కాగా, ఈ తాజా చర్య దరఖాస్తుదారులకు సహాయం చేయడమే కాకుండా దేశంలోని షూటింగ్ క్రీడాకారులకు ప్రత్యేకంగా ప్రయోజనం చేకూరుస్తుంది' అని అధికారులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడమే కాకుండా, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తాజా దరఖాస్తులను సమయానుకూలంగా పరిష్కరించడం కూడా చేస్తారన్నారు. పెండింగ్‌లో ఉన్న దాదాపు 6 వేల దరఖాస్తులను ఈ ఏడాది చివరి నాటికి త్వరగా పరిష్కరించాలని సక్సేనా పోలీసులను కోరారని, అలాగే మార్చి చివరి నాటికి సవరించిన ఆయుధాల లైసెన్సింగ్ పోర్టల్‌ను ప్రారంభించాలని ఆదేశించారని అధికారులు వివరించారు.

అక్రమ ఇమ్మిగ్రేషన్ రాకెట్...

గుజరాత్, ఢిల్లీలో ఈడీ దాడులు

న్యూఢిల్లీ : అక్రమ ఇమ్మిగ్రేషన్ రాకెట్‌కు సహకరిస్తున్న ఏజెంట్లపై ఈడీ దాడులు నిర్వహించింది. జనవరి 19-20 తేదీల్లో గుజరాత్‌లోని అహ్మదాబాద్, సూరత్, మెహసానా, ఢిల్లీలోని 22 ప్రాంతాల్లో సోదాలు జరిగాయి. అక్రమ విదేశీ ఇమ్మిగ్రేషన్‌కు సహకరించిన కేసులో ఇవి ప్రధాన కుట్రదారులైన బాబీ అలియాస్ భరత్‌భాయ్ పటేల్, చరణజిత్ సింగ్, ఇతరులతో ఈ అక్రమ వ్యవహారం ముడిపడి ఉందని దర్యాప్తు సంస్థ తెలిపింది. ఈ కేసులో పటేల్‌ను 2022లో గుజరాత్ పోలీసులు అరెస్టు చేశారు. అదే సంవత్సరం జరిగిన డింగుచా కేసులో కూడా ప్రమేయం ఉంది. అక్కడ కెనడా నుంచి అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించడానికి ప్రయత్నించినప్పుడు నలుగురు సభ్యులతో కూడిన భారత కుటుంబం మృతి చెందింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) లోని వివిధ సెక్షన్ల కింద నమోదయిన ఈడీ కేసు 2015 నుంచి భారతీయ పౌరులను అక్రమంగా విదేశాలకు పంపినందుకు నిందితులపై ఐపీసీ, పాస్‌పోర్ట్‌ల చట్టం కింద నమోదయిన రెండు గుజరాత్ పోలీసు ఎఫ్ఐఆర్‌ల నుంచి వచ్చింది. నిందితులు 'ప్రయాణికుల వలె నకిలీ లేదా బోగస్ పాస్‌పోర్ట్‌లతో వివిధ దేశాల వీసా పొందడానికి బోగస్ లేదా కల్పిత పత్రాల ఆధారంగా భారతీయ పౌరులను అక్రమంగా విదేశాలకు పంపిస్తున్నారు. వారు ఒక ప్రయాణీకుడి నుంచి 60-75 లక్షలు, ప్రతి జంట (భార్యభర్త) నుంచి రూ.1 కోటి నుంచి 1.25 కోట్లు, పిల్లలు వారి తల్లిదండ్రులతో కలిసి ఉంటే రూ.కోటిన్నర నుంచి 1.75 కోట్లు వసూలు చేసేవారు. రెండు రోజుల దాడుల్లో భారత కరెన్సీలో దాదాపు రూ.1.5 కోట్ల నగదు, దాదాపు 21 లక్షల విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ తెలిపింది. అలాగే, డిజిటల్, డాక్యుమెంటరీ రూపంలో అనేక ఇతర సాక్ష్యాలను స్వాధీనం చేసుకున్నారు.

నేటి సెలవుపై వెనక్కి తగ్గిన ఎయిమ్స్

న్యూఢిల్లీ: రామమందిరం ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం ఒకపూట సెలవు ఇచ్చే అంశంపై ఢిల్లీలోని ఎయిమ్స్ ప్రతిపక్షాల విమర్శలకు తలొగ్గి వెనక్కి తగ్గింది. అపాయింట్‌మెంట్‌లకు అనుగుణంగా ఓపీ విభాగం తెరిచే ఉంచుతామని ప్రకటించింది. రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. అన్ని కీలక విభాగాల సేవలు కూడా యథావిధిగా పనిచేస్తాయని తెలిపింది. అయోధ్య రామమందిరంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నేపథ్యంలో దేశవ్యాప్తంగా రామభక్తులు సంబరాలు చేసుకుంటున్నారు. వివిధ రాష్ట్రాలతోపాటు అనేక సంస్థలు సెలవు ప్రకటించాయి. ఈ క్రమంలోనే ఢిల్లీలోని ఎయిమ్స్ ఒకపూట (మధ్యాహ్నం 2.30 వరకు) సెలవు ప్రకటించింది. దీనిపై ప్రతిపక్షాల నుంచి వ్యతిరేకత వచ్చింది. ఎయిమ్స్ నిర్ణయంతో ఆరోగ్య సేవలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ శివసేన, తృణమూల్ కాంగ్రెస్ సహా అనేక పార్టీల నేతలు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేశారు. ఈ నేపథ్యంలోనే నిర్ణయాన్ని పునఃసమీక్షించుకున్న ఎయిమ్స్ సోమవారం అన్ని సేవలను యథావిధిగా కొనసాగిస్తామని ప్రకటించింది.

లెనిన్ మార్గం అనుసరణీయం

విశాలాంధ్ర-విజయవాడ: ప్రపంచ వ్యవస్థ మార్పు మార్క్స్ సిద్ధాంతంతోనే సాధ్యమని, దాన్ని అమలు చేసి చూపిన లెనిన్ మార్గం అనుసరణీయమని వక్తలు అన్నారు. కారల్‌మార్క్స్-ఎంగెల్స్-లెనిన్ విగ్రహ కమిటీ అధ్వర్యంలో వీఐ లెనిన్ శత వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని లెనిన్ విగ్రహం వద్ద ఆదివారం ఈ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ సీనియర్ నాయకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ 20వ శతాబ్దపు చరిత్ర గతిని మలుపుతిప్పిన మహనీయుడు లెనిన్ అని కొనియాడారు. బోల్షివిక్ పార్టీ, సైనికుల కృషితో నూతన సమాజాన్ని నిర్మాణం చేశారని తెలిపారు. అదే స్ఫూర్తిని, వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కమ్యూనిస్టులు కృషి చేస్తున్నారని చెప్పారు. భారతదేశంలో రైతాంగాన్ని, కార్మిక వర్గాన్ని కలుపుకుని అభ్యుదయ సమాజాన్ని నిర్మించాలని లెనిన్ సూచించారని అన్నారు. నాటి మినిట్స్ విజయ్ ప్రసాద్ రచించిన పుస్తకం ద్వారా ఇప్పుడు బయటకు వస్తున్నాయన్నారు. కమ్యూనిస్టులు లేకుండా సమాజ మార్పు సాధ్యం కాదని తెలిపారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కష్టజీవుల కోసం లెనిన్ పని చేయటం వల్లనే ఆయన చనిపోయి వందేళ్లు అయినా గుర్తు పెట్టుకున్నారని, నేడు భారతదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా లెనిన్ శత వర్ధంతిని ఘనంగా జరుపుకుంటున్నారని చెప్పారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమిలేక మతం చుట్టూ తిప్పుతున్నారని విమర్శించారు. రామ మందిరం నిర్మాణం కోసం ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, బీజేపీ ప్రచారం చేసుకుంటే పర్వాలేదని భారత ప్రభుత్వం, ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మత ప్రచారం చేయటం సరికాదన్నారు. సాధువులు, సన్యాసులు చేయాల్సిన పనిని ప్రధాన మంత్రి చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికులు సృష్టించిన సంపదను అదాని, అంబానికి మోదీ దోచిపెడుతున్నారని ధ్వజమెత్తారు. శ్రమజీవులు ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుందని, కష్ట జీవుల గుండెల్లో లెనిన్ కనిపిస్తారని తెలిపారు. రాబోయే రోజుల్లో లెనిన్ సెంటర్ స్ఫూర్తి కేంద్రంగా కొనసాగాలని సూచించారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచంలో సోషలిజం ఎలా ఉంటుందో చూపించిన మహానేత లెనిన్ అని అన్నారు. ఆయన స్ఫూర్తితో భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అనేక మంది ప్రభావితం అయ్యారని చెప్పారు. నేడు పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలో ఉందన్నారు. పాలకులు దానధర్మాలు చేస్తారు తప్ప వేతనాలు పెంచటానికి ఇష్టపడరని ఆనాడు లెనిన్ చెప్పిన మాట నేటి పాలకుల ద్వారా కనబడుతోందన్నారు. చైనా అభివృద్ధి చెంది... పెట్టుబడిదారీ విధానానికి సవాల్ విసురుతోందన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వం మత స్వేచ్ఛను నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ కారల్‌మార్క్స్ చెప్పిన సమాజ మార్పును చేసి చూపిన గొప్ప నాయకుడు లెనిన్ అన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకులు డి.రమాదేవి మాట్లాడుతూ మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన మొదటి సోషలిస్టు నాయకుడు లెనిన్ అన్నారు. జనసాహితి సంపాదకులు దివికుమార్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో కేజీ గ్యాస్ నిక్షేపాలను దోచుకోవటానికి మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. కమ్యూనిస్టు నాయకులు భార్గవశ్రీ మాట్లాడుతూ నేటి సమాజానికి లెనిన్ సిద్ధాంతాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు బుడ్డిగ జమిందార్, ప్రజాశక్తి బుక్ హౌస్ జనరల్ మేనేజర్ కె.లక్ష్మయ్య అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకుని విశాలాంధ్ర బుక్ హౌస్, ప్రజాశక్తి బుక్ హౌస్, ప్రజాసాహితి సంస్థలు ప్రచురించిన ప్రత్యేక సంచికలు, క్యాలెండర్‌ను కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ముందుగా ప్రముఖ కళాపోషకులు గోళ్ల నారాయణరావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన క్రేన్ సాయంతో లెనిన్ విగ్రహానికి కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు పూలమాల వేశారు. ఈడ్పుగంటి నాగేశ్వరరావు పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.చంద్రనాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, ప్రజానాట్య మండలి కార్యదర్శి అనిల్ తదితరులు అభ్యుదయ గీతాలు ఆలపించి ఉత్తేజితులను చేశారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు వందన సమర్పణ చేశారు. వామపక్ష ప్రచురణ సంస్థలు ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను అనేక మంది సందర్శించారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్య నారాయణ మూర్తి, కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్ బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, నాయకులు సీహెచ్.బాబూరావు, దోనేపూడి కాశీనాథ్, సీపీఐ ఎంఎల్ నాయకులు పి.ప్రసాద్, కె.పొలారితో పాటు వామపక్ష పార్టీల నేతలు, మేధావులు, లెనిన్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు లెనిన్ విగ్రహం వద్ద అభివృద్ధి చేశారు.

భవిష్యత్ తరాలకు దిక్సూచి లెనిన్

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): భవిష్యత్ తరాలకు దిక్సూచిలా వీఐ లెనిన్ ఉన్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా మార్క్స్-ఎంగెల్స్- లెనిన్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఐదు రోజులు పాటు కొనసాగే 'మాట-పాట' సాంస్కృతిక కళా ఉత్సవాల్లో మొదటి రోజు ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి అధ్యక్షులు పి.చంద్రనాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ లెనిన్ చిన్నతనం నుంచే శ్రమ దోపిడీ నివారించటానికి కృషి చేశారన్నారు. స్వీయ కుటుంబ అనుభవంతో అధ్యయనం చేసి జార్ చక్రవర్తి నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. మార్క్స్ సిద్ధాంతాన్ని ఔపోసన పట్టిన లెనిన్ కొంత కాలం అజ్ఞాతంలో ఉండి రష్యా, యూరప్ స్థితిగతులు అధ్యయనం చేశారన్నారు. గ్రామీణ పేదలందరిని విద్యావంతులను చేసి, దోపిడీ నుంచి విముక్తి చేసి మానవ సమాజాన్ని ప్రభావితం చేశారని కొనియాడారు. ఆధునిక కార్మిక వర్గమే విప్లవానికి చోదక శక్తి అని నిరూపించటం ద్వారా హోచిమిన్ ఇతర సోషలిస్టు నాయకులకు ఆదర్శంగా నిలిచారన్నారు. సామాన్య ప్రజల ఈతి బాధల పట్ల సున్నిత పద్ధతులలో విప్లవ ఉద్యమాన్ని ఆచరణ సాధ్యం చేసిన మహనీయుడు లెనిన్ అన్నారు. ఆయన ఆశయ సాధనకు సాంస్కృతిక కళల ద్వారా ప్రజా చైతన్యానికి నిరంతర కృషి సాగించాలని జేవీ సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. లెనిన్ విగ్రహ సెంటర్‌కు పూర్వ వైభవాన్ని తెచ్చిన నిర్వాహక కమిటీ సభ్యులందరికీ ప్రత్యేకించి గోళ్ళ నారాయణరావు, మనోహర్ నాయుడుకు, సహకరించిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సాంస్కృతిక ఉత్సవాలను కళా పోషకులు గోళ్ల నారాయణరావు ప్రారంభించారు.

స్ఫూర్తిదాయకంగా మాట-పాట: లెనిన్ శత వర్ధంతిని పుస్కరించుకుని నిర్వహించిన 'మాట-పాట' సాంస్కృతిక కార్యక్రమంలో ఆద్యంతం స్ఫూర్తివంతంగా సాగింది. మార్క్స్ సిద్ధాంతం, లెనిన్ ఉద్యమ కార్యాచరణ, హోచిమిన్, లక్సంబర్గ్, ఫీడెల్ కాస్ట్రో పోరాటలను స్మరిస్తూ నేతల ప్రసంగాలు స్ఫూర్తినిచ్చాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి అధ్యక్షులు పి.చంద్రనాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, విజయవాడ నగర నాయకులు లంక దుర్గారావు, ఎస్కే.నజీర్, శర్మ, బాషా, ప్రజానాట్య మండలి కార్యదర్శి ఎస్.అనిల్, అప్పన్న తదితరులు విప్లవ గీతాలు ఆలపించారు. అజేయమైనది కమ్యూనిజం. అజరామర మైనది సోషలిజం...,ఎర్రబాట..ఇది ఎర్రపాట.., రెపరెపలాడే ఎర్రని జెండా..ఎదిరించే పోరాడే జెండా..., ఓ...అరుణ పతాకామా.. చే గోనుమా రెడ్ సెల్యూట్... కమ్యూనిజం పిలుస్తోంది....కదులు సోదరా..వంటి గీతాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి మనోహర్ నాయుడు, ప్రజాశక్తి పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ కే లక్ష్మయ్య, సాహితీవేత్తలు గుమ్మా సాంబశివరావు, వెన్న వల్లభరావు, ప్రోగ్రేసివ్ ఫోరం నాయకులు బుడ్డిగ జమిందార్, సాహితీ ప్రియులు కళాభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ యాత్రలో చేరవద్దని బెదిరింపులు

బిస్వనాథ్ చారియాలి (అసోం): అసోంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం భారత్ జోడో న్యాయ యాత్రలో చేరకుండా ప్రజలను బెదిరిస్తోందని, ఆ మార్గంలోని కార్యక్రమాలకు అనుమతులను నిరాకరిస్తున్నదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆదివారం ఆరోపించారు. కానీ ప్రజలు బీజేపీకి భయపడరని స్పష్టం చేశారు. బిస్వనాథ్ జిల్లా ప్రధాన కార్యాలయం బిస్వనాథ్ చారియాలీలో జరిగిన బహిరంగ సభలో గాంధీ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీపై కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'యాత్రలో భాగంగా మేం సుదీర్ఘ ప్రసంగాలు చేయం. పతిరోజూ 7 నుంచి 8 గంటల పాటు ప్రయాణిస్తూ మీ సమస్యలను వింటూ ఈ సమస్యలను లేవనెత్తడమే మా లక్ష్యం' అని అనన్నారు. యాత్రలో పాల్గొనకుండా ప్రజలను బెదిరిస్తున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ జెండాలు, బ్యానర్లను ధ్వంసం చేస్తున్నారని, ఆ మార్గంలో కార్యక్రమాలకు అనుమతులు నిరాకరిస్తున్నారని ఆయన ఆరోపించారు. 'ప్రజలను అణచివేయగలమని వారు (ప్రభుత్వం) భావిస్తారు. కానీ ఇది రాహుల్ గాంధీ యాత్ర కాదని వారు గుర్తించడం లేదు. ఇది ప్రజల గొంతు కోసం చేస్తున్న యాత్ర' అని తెలిపారు. ఆదివారం ఉదయం అరుణాచల్ ప్రదేశ్ నుంచి బిస్వనాథ్ ద్వారా యాత్ర తిరిగి అసోంలోకి ప్రవేశించింది. 'రాహుల్ గాంధీ గానీ, అసోం ప్రజలు గానీ మిమ్మల్ని చూసి భయపడరని, మీరు ఏది కావాలంటే అది చేయగలరు. ఎన్నికలు వచ్చినప్పుడు కాంగ్రెస్ భారీ మెజార్టీతో బీజేపీని ఓడిస్తుంది' అని తెలిపారు. రాహుల్ గాంధీ కూడా ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మను లక్ష్యంగా చేసుకుని విమర్శలు కురిపించారు.

లెనిన్ పోరాట స్ఫూర్తితో కార్మిక హక్కులు సాధిద్దాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు

విశాలాంధ్ర-కడప రూరల్: వెయ్యేళ్లు అయినా మరిచిపోని విప్లవకారుడు, కార్మిక రాజ్య స్థాపకుడు లెనిన్ అని, లెనిన్ పోరాట స్ఫూర్తితో కార్మిక హక్కుల కోసం, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలని సీపీఐ రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు పిలుపునిచ్చారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా జిల్లా పరిషత్ హాల్ వద్ద చిత్రపటానికి పూలమాల వేసే నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషిని మరో మనిషి దోపిడీ చేయడం, ఒక వర్గం మరో వర్గాన్ని దోపిడీ చేయడం, ఒక రాజ్యాన్ని మరో రాజ్యం ఆక్రమించడం వంటి భూస్వామ్య రాచరిక వ్యవస్థను కూలదోసి కార్మిక వర్గ రాజ్య స్థాపనకు విశేషమైన కృషిచేసిన విప్లవ యోధులు లెనిన్ అని కొనియాడారు. జార్ చక్రవర్తి నిరంకుశత్వాన్ని రాచరిక వ్యవస్థను బానిస వ్యవస్థకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి కార్మిక వర్గ రాజ్యాన్ని స్థాపించారన్నారు. నేడు దేశంలో అధికారం చెలాయిస్తున్న భారతీయ జనతా పార్టీ ప్రజా స్వామిక హక్కులు, కార్మిక హక్కులు కాలరాస్తూ రామ రాజ్యం అంటూ రాచరిక వ్యవస్థను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు పరిశ్రమలు ఆస్తులు అన్ని ప్రైవేటుపరం చేస్తోందని దీంతో కార్మిక హక్కులు 8 గంటల పని విధానం లేకుండా చేసి బానిస వ్యవస్థ తయారు అవుతోందన్నారు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, కార్యవర్గ సభ్యులు నాగసుబ్బారెడ్డి, ఎంవి సుబ్బారెడ్డి, బషీరున్నీషా, విజయలక్ష్మి, సుబ్రమణ్యం, వెంకటశివ, కేసి.బాదుల్లా, జిల్లా సమితి సభ్యులు సావంత్ సుధాకర్, మద్దిలేటి, వెంకట్రామ్, మునయ్య, నాగేశ్వరావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఏఐటీయూసీ నాయకులు శివయ్య, మల్లికార్జున్‌రెడ్డి, రామలింగారెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయం లెనిన్ జీవితం: రామచంద్రయ్య

విశాలాంధ్ర-పత్తికొండ : ఆదర్శనీయం లెనిన్ జీవితం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం కర్నూలు జిల్లా పత్తికొండలో నిర్వహించారు. లెనిన్ చిత్రపటంతో స్థానిక చదువుల రామయ్య భవనం నుంచి పట్టణ పురవీధుల గుండా ర్యాలీ చేపట్టి నాలుగు స్తంభాల మండపం దగ్గర లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెనిన్ నాయకత్వంలో రష్యాలో జరిగిన అక్టోబర్ విప్లవం స్ఫూర్తిదాయకమన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిలేటి శెట్టి, మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, జిల్లా సమితి సభ్యులు సురేంద్ర కుమార్, గురుదాస్, కృష్ణయ్య, తిమ్మయ్య, ప్రజాసంఘాల నాయకులు ఉమాపతి, నెట్టికంటయ్య, గిడ్డయ్య గౌడ్, ఎం. కె.సుంకన్న, హనుమేష్, పెద్దయ్య, నజీర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు. కార్మిక రాజ్యస్థాపకుడు, అసమానతలు లేని రాజ్యాన్ని నిర్మించిన మహాశయుడు వీఐ లెనిన్ అని సీపీఐ కర్నూలు జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ కర్నూలు నగర సమితి ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని రాజ్ విహార్ కూడలి వద్ద సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన లెనిన్ చిత్ర పటానికి గిడ్డయ్య, ఏపీ రైతు సంఘం కార్యదర్శి కె.జగన్నాథం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమములో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని ఎమ్మిగనూరు, ఆదోని, డోన్, నంద్యాల, నందికొట్కూరు, బనగానపల్లె లలో లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అఖిలభారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి, సీపీఐ జాతీయ కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్‌ని లక్నో ఆసుపత్రిలో కలిసి ఆరోగ్య విషయాలను తెలుసుకుంటున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, ఏఐకేఎస్ అధ్యక్షులు రావుల వెంకయ్య తదితరులు.

యువతకు ఆదర్శం లెనిన్ పోరాట పటిమ

ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు: ప్రపథమ సోషలిస్టు రాజ్య స్థాపకులు వీఐ లెనిన్ పోరాటపటిమ నేటి యువతకు ఆదర్శనీయమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం గుంటూరు జిల్లా వ్యాప్తంగా జయప్రదంగా నిర్వహించారు. గుంటూరు నగరంతో పాటు జిల్లాలోని అన్ని పట్టణాలు, నియోజకవర్గాలు, మండలాలలో లెనిన్ విగ్రహాలకు, చిత్రపటాలకు సీపీఐ శ్రేణులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలలో శత వర్ధంతి సభలు నిర్వహించారు. గుంటూరు నగరంలో జరిగిన వర్ధంతి సభలో ముప్పాళ్ల నాగేశ్వరరావుతో పాటు కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచాన్ని శాసిస్తున్న సామ్రాజ్యవాదంపై తిరగబడి ప్రత్యామ్నాయ వ్యవస్థను తీసుకురావడంతో పాటు దానిని ఆచరణలో చూపిన గొప్పనేత కామ్రేడ్ వీఐ లెనిన్ అని కొనియాడారు. దోపిడికి, బానిసత్వానికి వ్యతిరేకంగా ఆనాడు ఆయన పోరాడిన తీరు నేటి యువతకు స్ఫూర్తిదాయమన్నారు. కమ్యూనిస్టుగా ఉండటము, బతకడం కాదని, కమ్యూనిస్టు విలువలు, ఆశయాలను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేసుకోవడమే శత వర్ధంతి సందర్భంగా లెనిన్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. మంగళగిరిలో జరిగిన సభలో చేతివృత్తిదారులసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు పాల్గొన్నారు. ఆయా ప్రాంతాలలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శులతో పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొని లెనిన్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాలలో వక్తలు ప్రసంగిస్తూ సోషలిస్టు రాజ్య ప్రాముఖ్యతను తెలిపారు. సోషలిస్టు రాజ్య స్థాపనకు లెనిన్ చేసిన కృషిని వివరించారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వాలను గద్దెదించేందుకు లెనిన్ చూపిన బాటలో నడవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

విప్లవ రథసారథి విఐ లెనిన్

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వరరావు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: కమ్యూనిజమే ఆయుధంగా రష్యా విప్లవానికి సారథ్యం వహించి విజయపథంలో నడిపించి ప్రపంచంలో సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించిన విప్లవ రథసారథి విఐ లెనిన్ మహనీయుడని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్ కోటేశ్వరరావు శ్లాఘించారు. విఐ లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలో వివిధ కేంద్రాలలో జరిగిన కార్యక్రమాల్లో కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లెనిన్ నాయకత్వంలో సాగిన అక్టోబర్ మహావిప్లవ పోరాట చరిత్రను, ఆనాటి ప్రజల త్యాగాలను వివరించారు. మార్క్సిజాన్ని అధ్యయనం చేసి ఆచరణ సాధ్యమయ్యే విధంగా మెరుగులు దిద్ది, మరింత పదును పెట్టారని తెలిపారు. దోపిడీ పాలకులైన జార్ చక్రవర్తులను గద్దె దించి, వర్గ, దోపిడీ రహిత వ్యవస్థ సోషలిస్టు రాజ్య స్థాపనకు వీరోచితమైన నాయకత్వ పాత్రను పోషించారని వివరించారు. ప్రపంచంలో అనేక దేశాలు ఈ స్ఫూర్తితో సోషలిస్టు రాజ్యాలుగా వడివడిగా విప్లవ పోరాటాల ద్వారా రూపాంతరం చెందాయన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం విజయవంతం కావడంలో లెనిన్ చూపిన మార్గదర్శకాలు ముఖ్య పాత్ర వహించాయని చరిత్రలోని అనేక సంఘటనలు రుజువు చేస్తున్నాయని తెలిపారు. లెనిన్ మహాసేన పోరాట బాటలో మన దేశంలో కూడా సమసమాజ స్థాపనకు సన్నద్ధం కావాలన్నారు. తొలుత లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు దుర్గా కోటేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. ఇబ్రహీంపట్నంలో సీపీఐ మండల కార్యదర్శి కన్నా వెంకటేశ్వరరావు, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు టి.నర్సింహారావు, జి.మధుసూదన్ రావు, రాంబాబు, జమలయ్య, ఎస్.వి.కృష్ణ తదితరులు నాయకత్వం వహించారు. రంగాపురంలో పోతురాజు సాంబయ్య, ఏసు, చల్లదాసు, పి.గణపతి వీరాస్వామి తదితరులు, పార్టీ మండల కార్యదర్శి అడపా సుబ్బారావు, రాఘవులు, తిరుపతిరావు, నరసింహారావు, వెంకటేశ్వరరావు తదితరులు నాయకత్వం వహించారు.

మార్క్సిజమే దిక్సూచి: డి.పాపారావు

విశాలాంధ్ర-ఒంగోలు: మార్క్సిజమే సకల మానవాళికి దిక్సూచి అని ప్రముఖ సామాజిక, అర్థశాస్త్ర, సైద్ధాంతిక విశ్లేషకులు డి.పాపారావు అన్నారు. విఐ లెనిన్ శత వర్ధంతిని ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఒంగోలుతో పాటు కనిగిరి, మార్కాపురం, ఎర్రగొండపాలెంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో సైంటిఫిక్ సోషలిస్ట్ స్టడీ సర్కిల్ అధ్వర్యంలో మార్క్సిజం సకల మానవాళికి దిక్సూచి కాబోతుందా అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కమ్యూనిజం పత్రిక ఎడిటర్ ఎంసీ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. వక్తగా హాజరయిన డి.పాపారావు మాట్లాడుతూ 107 సంవత్సరాల క్రితం మానవ సమాజాన్ని పట్టిపీడిస్తున్న రాచరికం, వెట్టి చాకిరి, వలస పాలన విధానం, అవిద్య, అంతులేని దోపిడీ, దురాక్రమణ వంటి ఆటవిక పాలనా విధానాన్ని అంతం చేయడానికి మార్క్సిజం అనే సిద్ధాంత వెలుగులో విఐ లెనిన్ సారథ్యంలో రష్యాలో మొట్టమొదటి సోషలిస్టు విప్లవ రాజ్యం ఏర్పడిందన్నారు. పెట్టుబడిదారీ సమాజంలో ప్రజల, కార్మికుల శ్రమ దోపిడీ జరుగుతూనే ఉంటుందన్నారు. సంపద కొద్దిమంది చేతుల్లోనే కుప్పలుగా చేరుతుందన్నారు. ప్రజలు నిత్యం ఉపాధి కోసం, తిండి, కూడు, గుడ్డ కోసం అల్లాడుతూనే ఉంటారని తెలిపారు. ప్రభుత్వాలు కూడా పెట్టుబడిదారుల పక్షాన నిలిచి వారికి ఊడిగం చేస్తూనే ఉంటాయన్నారు. పెట్టుబడిదారీ సమాజం ఉన్నంతకాలం నిరుద్యోగం రాజ్యమేలుతూనే ఉంటుందన్నారు. యాంత్రీకరణ పేరుతో కార్మికుల సంఖ్య పరిశ్రమలలో గణనీయంగా తగ్గిస్తూనే ఉంటారన్నారు. కార్మికులు మరింత బానిసలుగా మారతారన్నారు. కార్మిక హక్కులు హరించి వేస్తారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో కార్మిక, శ్రామిక వర్గానికి, ప్రజలకు మార్క్సిజం దిక్సూచిగా నిలుస్తుందన్నారు. తొలుత లెనిన్ శత వర్ధంతిని నిర్వహించారు. అనేక మంది లెనిన్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ, ఒంగోలు నగర కార్యదర్శి పి.వి.ఆర్.చౌదరి, సైంటిఫిక్ సోషలిస్ట్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎం.వెంకయ్య, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.డి.సర్దార్, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.వెంకట్రావు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి, సీపీఐ కొండేపి మండల కార్యదర్శి లక్ష్మి, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎం.విజయ, పీడీపీఎఫ్ బ్యాంక్ చైర్మన్, న్యాయవాది పోతినేని వెంకటేశ్వర్లు తదితరులు లెనిన్‌కు నివాళులర్పించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.